http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

సోమవారం 18 మే 2026

పేజీలు : 5 వెల : 5/-

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# గులాబీ మిషన్ 2028




- పార్టీ ఓటమి అనంతరం కొంతకాలం స్తబ్దుగా ఉన్న గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం
- కేసీఆర్ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం డిజిటల్ సభ్యత్వ నమోదు. గతంలో అనుసరించిన సంప్రదాయ సభ్యత్వ పద్ధతులకు స్వస్తి పలికి, పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి సభ్యత్వాలను నిర్వహించాలని నిర్ణయించారు
- రైతు రుణమాఫీలో జాప్యం, ధరణి పోర్టల్ సమస్యలు, నిరుద్యోగ భృతి వంటి హామీల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు.
- గతంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల కంటే, ఈసారి ప్రజలతో నేరుగా మమేకమయ్యేలా 'జన చైతన్య యాత్రల'కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు

హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడించేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు సమర శంఖం పూరించారు. పార్టీ ఓటమి అనంతరం కొంతకాలం స్తబ్దుగా ఉన్న గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో కేసీఆర్ కీలక భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు సహా 23 మంది ముఖ్య నేతలతో సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశం, కేవలం ఒక సమీక్షగా కాకుండా, రాబోయే నాలుగేళ్ల ప్రయాణానికి దిక్సూచిగా నిలిచింది. కేసీఆర్ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం డిజిటల్ సభ్యత్వ నమోదు. గతంలో అనుసరించిన సంప్రదాయ సభ్యత్వ పద్ధతులకు స్వస్తి పలికి, - మిగతా3లో



## 11శతాబ్దం నాటి చోళ వారసత్వ సంపద తిరిగి భారత్‌కు

- ప్రధాని మోదీకి అప్పగించిన నెదర్లాండ్స్
- నెదర్లాండ్స్ నుంచి భారత్‌కు విజయవంతంగా తిరిగి రానున్న చోళ రాగి ఫలకాలు
- "ప్రతి భారతీయుడికి ఇది ఒక ఆనందకరమైన క్షణం!
- ఇతర దేశాలు దొంగిలించిన వారసత్వ సంపదను తిరిగి పొందే విషయంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న విజయాలకి ఇది నిదర్శనంగా నిలిచింది
- ఇదిలా ఉండగా భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి

## బండి సంజయ్ కేంద్రమంత్రిగా కొనసాగడం దేశానికే అవమానం



- రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయింది
- కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్– నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో కేటీఆర్ ఈ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం - మిగతా3లో

## బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాలే టార్గెట్




- తగ్గేదే లే అనే రేంజులో మహిళలు, ఫ్రెషర్స్ పోటీ
- మెరుగైన వేతనం, మంచి జాబ్ కోసం వలసలకూ రెడీ
- సుదూరాల్లోని ఉద్యోగాల కోసమూ దరఖాస్తుల వెల్లువ
- తగ్గేదే లే అనే రేంజులో మహిళలు, ఫ్రెషర్స్ పోటీ
- టైర్–2 నగరాల్లోనూ అపార ఉద్యోగ అవకాశాలు

## కేరళ కొత్త మంత్రివర్గం ఖరారు!



- ప్రమాణ స్వీకారానికి ముందే ప్రకటించిన సతీశన్
- కేరళలో సోమవారం కొలువుదీరనున్న యూడీఎఫ్ ప్రభుత్వం
- సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న వీడీ సతీశన్
- హాజరుకానున్న ఖర్గే, రాహుల్, ప్రియాంక, ఇతర సీనియర్ నేతలు
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యే అవకాశం



## బండి భగీరథ్‌తో పార్టీకి సంబంధం లేదు

- రాష్ట్ర పోలీసులు అంశంలో కేంద్రానికి ఎటువంటి సంబంధం ఉండదు
- పెట్రోల్ పై ట్యాక్స్ తగ్గించాలని కేంద్ర కోరినా రాష్ట్రం ఏమాత్రం తగ్గించడం లేదు
- చట్టం ముందు అందరూ సమానమే.. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాల్సిందే
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్

బండి భగీరథ్ అంశమై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బండి భగీరథ్ ఇదివరకే సరెండర్ అయ్యారని ఆ విషయంతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసులు అంశంలో కేంద్రానికి ఎటువంటి సంబంధం ఉండదని తెలిపారు. ఈ కేసులో పోలీసుల విచారణ కొనసాగుతుందని తెలిపారు. పెట్రోల్ పై ట్యాక్స్ తగ్గించాలని కేంద్ర కోరినా రాష్ట్రం - మిగతా3లో

# అక్రమ ఓటర్లకు సర్‌తో చెక్

- ఇంటింటికీ వచ్చి 'సర్' ఎన్యుమరేషన్
- ఏయే వివరాలు అడుగుతారో తెలుసా
- తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)
- రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహణ
- ఇంటింటికీ వచ్చి ఎన్యుమరేషన్? ఫారాలు అందజేయనున్న అధికారులు




హైదరాబాద్

తెలంగాణలో చేపట్టే ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) లో భాగంగా జూన్ 25 నుంచి జులై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వచ్చి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారు. ఒక్కో ఓటరు రెండు ఫారాల్లో తమ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. వీటిని ఆధారంగా చేసుకుని ఓటర్ల జాబితాలో పేరును చేరుస్తారు. తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌లు ఈ ఎన్యుమరేషన్ ఫారం వివరాలను ఈ విధంగా పొందుపరిచారు. ఓటరు పేరు, చిరునామా, పార్ట్ నంబరు, శాసనసభ లేదా పార్లమెంట్ నియోజకవర్గ వివరాలు, - మిగతా3లో

## రష్యాపై భారీ డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి



- భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి
- రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధృవీకరించింది
- భారతీయ కార్మికులకు అవసరమైన సహాయం అందించడానికి కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోంది'



## మోదీజీ.. నీట్ పేపర్ లీకేజీపై సమాధానం చెప్పండి

- ప్రధానిని ప్రశ్నించిన రాహుల్ గాంధీ
- "నీట్ 2024 : పేపర్ లీకైంది. పరీక్ష రద్దైంది
- మంత్రి మాత్రం రాజీనామా చేయలేదు



## బంగాల్‌లో చక్రం తిప్పిన ఆర్ఎస్ఎస్

- కమల వికాసానికి సంఘ్ పక్కా వ్యూహం.. పెద్దసంఖ్యలో ఆర్ఎస్ఎస్ శాఖల ఏర్పాటు
- బంగాల్‌లో బీజేపీ విక్టరీలో ఆర్ఎస్ఎస్‌దే కీలక పాత్ర
- టర్నింగ్ పాయింట్లుగా మారిన ఆర్ఎస్ఎస్ చీఫ్ 2025 పర్యటనలు
- ఇంటింటి ప్రచారం నుంచి సోషల్ మీడియా దాకా అన్నింటా ఆర్ఎస్ఎస్ వాణి

# 11 శతాబ్దం నాటి చోళ వారసత్వ సంపద తిరిగి భారత్‌కు

భారతదేశం అద్భుత దౌత్య, సాంస్కృతిక విజయాన్ని సాధించింది. 11వ శతాబ్దానికి చెందిన చారిత్రక 'చోళ రాగి ఫలకాలను' నెదర్లాండ్స్ నుంచి భారత్‌కు విజయవంతంగా తిరిగి తీసుకురానుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో శనివారం జరిగిన ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో ఈ కళాఖండాలను అధికారికంగా తిరిగి అప్పగించారు. ఈ క్రమంలోనే నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. 19వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ అసాధారణమైన రాగి ఫలకాలను జాగ్రత్తగా భద్రపరిచిన లైడెన్ విశ్వవిద్యాలయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్-నెదర్లాండ్స్ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలకు ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలిచింది.

మరోవైపు వారసత్వ సంపదను తిరిగి పొందడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. "ప్రతి భారతీయుడికి ఇది ఒక ఆనందకరమైన క్షణం! 11వ శతాబ్దానికి చెందిన చోళుల రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి భారతదేశానికి తిరిగి రానున్నాయి. ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను. చోళుల రాగి ఫలకాల్లో 21 పెద్ద ఫలకాలు, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై ఎక్కువగా ప్రపంచంలోని అత్యంత అందమైన భాషల్లో ఒకటైన తమిళంలోని రచనలు ఉన్నాయి. ఇవి రాజేంద్ర చోళుడు × తన పూర్వీకులు తండ్రి, మొదటి రాజరాజ చక్రవర్తి చేసిన మౌఖిక వాగ్దానాన్ని అధికారికంగా నెరవేర్చడానికి సంబంధించినవి. అవి చోళుల గొప్పతనాన్ని కూడా చాటిచెబుతాయి. భారతదేశంలో చోళులు, వారి సంస్కృతి, సముద్రయాన పరాక్రమం పట్ల ఎంతో గర్వపడుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు.

ఇవి నెదర్లాండ్స్‌లో లైడెన్ ఫలకాలుగా, భారతదేశంలో అనైమంగళం రాగి ఫలకాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాచీన శాసనాలను తిరిగి తీసుకురావాలని భారత్? 2012 నుంచి అవిశ్రాంతంగా ప్రయత్నిస్తోంది. సుమారు 30 కిలోగ్రాముల బరువున్న ఈ 21 రాగి ఫలకాలు, చోళ సామ్రాజ్య అధికారిక



రాజముద్రను కలిగిన ఒక భారీ కంచు ఉంగరంతో ఉంది. ఇది భారత సరిహద్దుల వెలుపల ఆ రాజవంశానికి సంబంధించిన అత్యంత కీలకమైన ఆధారాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఈ గ్రంథాలు సంస్కృతం, తమిళం రెండింటిలోనూ ఉన్నాయి. ఇతర దేశాలు దొంగిలించిన వారసత్వ సంపదను తిరిగి పొందే విషయంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న విజయాలకి ఇది నిదర్శనంగా నిలిచింది. ఇదిలా ఉండగా భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. ఈ మేరకు ఆ దేశ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్ మధ్య చర్చల సందర్భంగా రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర రంగాల్లో కలిపి ఇరు దేశాలు 17 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. చర్చల సందర్భంగా ఇరు దేశాల ప్రధానమంత్రులు పశ్చిమాసియాలో పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్లోబల్ ఎనర్జీ సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు ఆటంకాల వల్ల ఈ ప్రాంతం సహా ప్రపంచంపై పడే తీవ్ర ప్రభావాలపై సమాలోచనలు జరిపారు. హర్మూజ్ జలసంధి నుంచి నౌకాయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ వాణిజ్య ప్రవాహం కొనసాగాలని మోదీ, జెట్టెన్ పిలుపునిచ్చారు. ఎలాంటి నియంత్రణ చర్యలనైనా వ్యతిరేకించాలని, ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు తమ మద్దతును కొనసాగించాలని ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్‌లో తాజా పరిస్థితి, రష్యాతో కొనసాగుతున్న ఘర్షణ, ప్రాంతీయ భద్రతా పరిణామాల గురించి కూడా ఇరువురు నేతలు చర్చించారు. చర్చలు, దౌత్యం ద్వారా ఉక్రెయిన్‌లో శాశ్వతమైన శాంతిని సాధించే ప్రయత్నాలకు మద్దతు కొనసాగించాలని పేర్కొన్నారు. అటు నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో కలిసి ఆదివారం అఫ్స్లుయిట్‌డైక్ డ్యామ్‌ను ప్రధాని మోదీ సందర్శించారు.

# బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాలే టార్గెట్

మెరుగైన వేతనం, బంగారు భవిష్యత్తునిచ్చే బ్లూ కాలర్, గ్రే కాలర్ ఉద్యోగాల కోసం స్వస్థలాల నుంచి వలస వెళ్తున్న భారతీయ మహిళలు, ఫ్రెషర్స్ సంఖ్య గణనీయంగా పెరిగింది. 2025 జనవరి - ఏప్రిల్ నాటితో పోలిస్తే, 2026 జనవరి - ఏప్రిల్‌లో ఈ జాబ్స్ కోసం ఇతర నగరాలకు వలస వెళ్లిన మహిళలు, ఫ్రెషర్స్ సంఖ్య 31.4 శాతం మేర పెరిగింది. స్వస్థలాల్లో (స్థానికంగా) ఉద్యోగాల కోసం మహిళలు, ఫ్రెషర్స్ నుంచి వచ్చే దరఖాస్తుల సంఖ్యలో మాత్రం వృద్ధి రేటు 20.2 శాతమే ఉంది. అంటే స్వస్థలాల్లోని ఉద్యోగ ఖాళీల కంటే సుదూర నగరాల్లోని ఉద్యోగ ఖాళీలకే భారతీయ మహిళలు, ఫ్రెషర్స్ నుంచి ఎక్కువ జాబ్ అప్లికేషన్లు అందుతున్నాయి. ఈవివరాలతో బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల భర్తీ సంస్థ 'వర్క్ ఇండియా' ఒక అధ్యయన నివేదికను విడుదల చేసింది.

**నాడు 65 లక్షల దరఖాస్తులు - నేడు 86 లక్షల దరఖాస్తులు**

వర్క్ ఇండియా ప్లాట్‌ఫామ్‌పై 2026 జనవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల కోసం 3.5 కోట్లకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వాటి సమాచారం ఆధారంగానే ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం, స్వస్థలాలకు దూరంగా భారత్‌లోని వివిధ నగరాలలో ఉన్న బ్లూ కాలర్, గ్రే కాలర్ ఉద్యోగాల కోసం 2025 జనవరి - ఏప్రిల్‌లో 65 లక్షల మందే అప్లై చేయగా, 2026 జనవరి - ఏప్రిల్‌లో ఏకంగా 86 లక్షల మంది దరఖాస్తు చేశారు. ఈ లెక్కన దేశంలోని ఒక నగరం నుంచి మరొక నగరానికి వలస వెళ్లి పని చేసే కార్మికుల సంఖ్య అనేది, స్థానిక కార్మికుల సంఖ్య కంటే 1.5 రెట్లు వేగంగా పెరుగుతోంది.

**బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాలంటే?**

బ్లూ కాలర్ ఉద్యోగం అంటే శారీరక శ్రమతో కూడినది. ఈ పనులను ఫ్యాక్టరీలు, నిర్మాణ రంగాలు, మైదానాల్లో చేస్తారు. గ్రే కాలర్ ఉద్యోగం అంటే వైట్ కాలర్, బ్లూ కాలర్ రంగాల కలయికతో కూడిన పని. ఆఫీసు పనులతో పాటు శారీరక శ్రమతోనే కూడిన జాబ్స్ ఇందులో భాగంగా ఉంటాయి.

**'వర్క్ ఇండియా' నివేదికలోని కీలక అంశాలు**

వర్క్ ఇండియా ప్లాట్‌ఫామ్‌లోని ప్రతీ నలుగురు ఉద్యోగులలో దాదాపు ఒకరు (24.1 శాతం) ఇప్పుడు(2026 జనవరి - ఏప్రిల్) తమ స్వస్థలం వెలుపల ఉద్యోగ అవకాశాల కోసం




చురుగ్గా వెతుకుతున్నారు. ఏడాది క్రితం (2025 జనవరి - ఏప్రిల్) ఈ రకం ఉద్యోగార్థుల సంఖ్య 22.5 శాతమే ఉండేది. సుదూర ప్రాంతాలు, నగరాల్లో బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలు జరిగినా గతంలో మహిళలు చాలా తక్కువగా అప్లై చేసేవారు. పెద్దసంఖ్యలో పురుషులే దరఖాస్తులు సమర్పించేవారు. కానీ ఇప్పుడు సీన్ మారింది. మెరుగైన వేతనమిచ్చే అత్యుత్తమ బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల కోసం స్వస్థలాలను వదిలి వెళ్లేందుకు మహిళలు చొరవ చూపుతున్నారు. ఇది అత్యంత కీలక సానుకూల పరిణామం. ఈ పరిణామం బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల భర్తీలో లింగపరమైన అంతరాన్ని తగ్గించేందుకు దోహదం చేయనుంది.

ఉద్యోగాల మార్కెట్‌లో ఓవరాల్‌గా బ్లూ కాలర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే మొత్తం అభ్యర్థుల సంఖ్య 2026 జనవరి - ఏప్రిల్‌లో సగటున 22.7 శాతం మేర పెరిగింది. ఈ పెరుగుదలను సంఖ్యా పరంగా చూస్తే, స్వస్థలాలను వదిలేసి వేరే నగరాలకు వలస వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్న బ్లూ కాలర్ కార్మికుల సంఖ్య చాలా భారీగా ఉంటుంది.

స్వస్థలాలకు దూరంగా ఇతర ప్రాంతాలు, నగరాల్లోని ఉద్యోగాల కోసం అనుభవజ్ఞులైన ఉద్యోగులు సమర్పించే దరఖాస్తులు 5 శాతం పెరగగా, ఫ్రెషర్స్ దరఖాస్తుల సంఖ్య గణనీయంగా 11 శాతం పెరిగింది.

ఆఫీస్ వర్క్స్, సేల్స్, హెల్త్ కేర్ వంటి ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు వలస వెళ్లడానికి సుముఖత వ్యక్తం చేసే బ్లూ కాలర్, గ్రే కాలర్ కార్మికుల సంఖ్య ఈ సంవత్సరం పెరిగింది. మెరుగైన వేతనాలు, మంచి పని వాతావరణం కోసమే కార్మికులు స్వస్థలాలను వదిలి వెళ్లేందుకూ సిద్ధపడుతున్నట్లు వర్క్ ఇండియా తెలిపింది. తయారీ, డెలివరీ, డ్రైవింగ్, ఆటోమొబైల్, గృహ కార్మికులు వంటి విభాగాల జాబ్స్ దూర ప్రాంతాల్లో ఉన్నా ఎక్కువ మంది దరఖాస్తులు సమర్పిస్తున్నారు. చాలా దశాబ్దాలుగా భారత ప్రజలు ఈ రకం ఉద్యోగాల కోసమే స్వస్థలాలను వదిలి, దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళు తున్నారు.

**టైర్-2 నగరాల్లోనూ అపార అవకాశాలు**

భారత్‌లో ఉద్యోగ అవకాశాలు అనేవి సాంప్రదాయ మెట్రో నగరాలకు మించి విస్తరిస్తూనే ఉన్నాయని వర్క్‌ఇండియా నివేదిక తెలిపింది. అహ్మదాబాద్, జైపుర్, కోయంబత్తూర్, ఇండోర్, లఖ్‌నవూ వంటి నగరాల్లో నియామకాలు పెరుగుతున్నాయి. వేతన వ్యత్యాసాలు, పెరుగుతున్న ఇంటి ఖర్చులు, జీవన నాణ్యత వంటి అంశాలకు కార్మికులు ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో మెట్రో నగరాల్లోనే ఎక్కువ జీతాలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు టైర్-2 నగరాల్లోని పరిశ్రమలు, స్టార్టప్‌లు కూడా మెరుగైన, పోటీతత్వంతో కూడిన వేతనాలను ఇస్తున్నాయి. అందువల్లే ఇప్పుడు దేశంలోని టైర్-2 నగరాల్లోని సంస్థలకూ దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.

**మహిళలు, ఫ్రెషర్స్ కూడా రెడీ**

"గతంలో వలస అనగానే పురుషులే గుర్తుకొచ్చేవారు. కానీ ఇప్పుడు మహిళలు, ఫ్రెషర్స్ కూడా మెరుగైన జాబ్స్ కోసం వలస బాట పడుతున్నారు. గతంలో మెట్రో నగరాల్లోనే జాబ్ అవకాశాలు ఉండేవి. ఇప్పుడు టైర్ 2 నగరాల్లోనూ భారీ శాలరీలతో ఉద్యోగాలు దొరుకుతున్నాయి. ప్రత్యేకించి బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగ విభాగాల్లో ఈ ట్రెండ్‌ను మేం గుర్తించాం. ఫ్రెషర్స్, మహిళలతో సహా లక్షలాది మంది భారతీయులు ఈ విభాగాల్లో తమ కెరీర్‌ను ఎంచుకుంటున్నారు" అని వర్క్‌ఇండియా సహ వ్యవస్థాపకుడు, సీఈఓ నీలేశ్ దుంగర్వాల్ తెలిపారు.

# బంగాల్‌లో చక్రం తిప్పిన ఆర్‌ఎస్‌ఎస్

బంగాల్ ఎన్నికల్లో బీజేపీ తొలిసారిగా అద్భుత విజయాన్ని సాధించింది. రాష్ట్రంలోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకుగానూ అనూహ్యంగా 207 చోట్ల గెలుపుబావుటా ఎగరేసింది. బంగాల్‌లో 2016 ఎన్నికల్లో 3 సీట్లు, 2021 ఎన్నికల్లో 77 సీట్లకు పరిమితమైన కమలదళం ఈసారి మాత్రం ఒంటరిగానే డబుల్ సెంచరీ కొట్టింది. ఈ సూపర్ బంపర్ రిజల్ట్ అంత ఆషామాషీగా రాలేదు. ఈ విజయంలో ఒక్క బీజేపీ శ్రమ మాత్రమే లేదు. ఆ పార్టీ మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)కు చెందిన సంఘ్ ప్రచారక్‌ల అలుపెరుగని గ్రౌండ్ వర్క్ కూడా ఉంది. ఏమాత్రం మీడియా పబ్లిసిటీని కోరుకోకుండా, అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు నుంచే ఆర్‌ఎస్‌ఎస్ చేసిన క్షేత్రస్థాయి పని వల్లే బంగాల్‌లో బీజేపీకి అధికార పీఠం దక్కింది. ఇంతకీ ఆర్‌ఎస్‌ఎస్ గ్రౌండ్ వర్క్ ఎలా చేసింది ? హిందూ ఓటర్లలోని ఏయే వర్గాలను ఏవిధంగా ఆకట్టుకుంది ? 2021 బంగాల్ ఎన్నికల ఫలితాల నుంచి బీజేపీ ఏం గ్రహించింది ? 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సీట్లు తగ్గడానికి, ఆర్‌ఎస్‌ఎస్‌తో సమన్వయ లోపం ఒక కారణమా ? ఈ కథనంలో తెలుసుకుందాం.

**పెద్దసంఖ్యలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖల ఏర్పాటు**

బంగాల్‌తో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధం చాలా పాతది. రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ తొలి శాఖను కోల్‌కతాలో 1939లో ప్రారంభించారు. రాష్ట్రంలో 1977 నుంచి 2011 వరకు దాదాపు 34 ఏళ్ల పాటు కమ్యూనిస్ట్ ప్రభుత్వం బలంగా సాగింది. ఆ టైంలో ఆర్‌ఎస్‌ఎస్ బహిరంగంగా రాజకీయ ప్రభావం చూపలేకపోయింది. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో విద్యా సంస్థలు, సేవా కార్యక్రమాలు, గిరిజన ప్రాంతాల్లో గిరిజన కళ్యాణ్ ఆశ్రమాల ద్వారా తన పునాదిని నిశ్శబ్దంగా విస్తరించుకుంటూ వచ్చింది. 2011లో కమ్యూనిస్ట్ పాలన అంతమై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధికారంలోకి వచ్చిన తర్వాత, బంగాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శాఖల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇప్పుడు ఉత్తర, మధ్య, దక్షిణ బంగాల్ ప్రాంతాల్లో దాదాపు 4,500కుపైగా ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు ఉన్నాయి. రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖ లేని జిల్లా కానీ, ప్రాంతం కానీ లేదు.

**2021 ఎన్నికల ఫలితాలతో కనువిప్పు**

2021 బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర బీజేపీకి 200 సీట్ల లక్ష్యాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్దేశించారు. కానీ అప్పట్లో పార్టీ 77 సీట్లకు మించి గెలవలేకపోయింది. దీంతో కేవలం రాజకీయ ర్యాలీలు, పత్రికా సమావేశాలతో రాష్ట్ర అధికార పీఠాన్ని కైవసం చేసుకోలేమని బీజేపీ కేంద్ర నాయకత్వం గ్రహించి ఉండొచ్చు. రాష్ట్రంలో అధికారం దక్కాలంటే, తొలుత ప్రజల విశ్వాసాన్ని గెల్చుకోవాలని కమలదళం తెలుసుకుంది. బంగాల్‌లోని మైనారిటీ ఓటు బ్యాంకు మొత్తం మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ వైపే ఉంది. ఇక ఇదే సమయంలో హిందూ వర్గంలోని ప్రధాన వర్గాల మద్దతును సైతం టీఎంసీ పొందుతోంది. బీజేపీ తనదైన శైలిలో కేవలం హిందూ ఓటుబ్యాంకుపైనే ఫోకస్ పెట్టింది. ఈ ప్రయత్నంలో కమలదళానికి ఆర్‌ఎస్‌ఎస్ సహాయ సహకారాలను అందించింది.

## కేరళ కొత్త మంత్రివర్గం ఖరారు!




కేరళలో సోమవారం వీడీ సతీశన్ సారథ్యంలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్-యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరేందుకు రంగంసిద్ధమైంది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో వీడీ సతీశన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాంగ్రెస్ నుంచి 12 మంది, ఐయూఎంఎల్ నుంచి ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. అయితే, భాగస్వామ్యపక్షాలతో ఇవాళ జరిగిన చర్చల్లో కేబినెట్ కూర్పుపై స్పష్టత వచ్చినట్లు కానున్న ముఖ్యమంత్రి సతీశన్ తెలిపారు. పార్టీ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితలా, మురళీధరన్, సన్నీ జోసెఫ్‌లు కేబినెట్‌లో చేరనున్నట్లు చెప్పారు. యూడీఎఫ్‌లో కీలక భాగస్వామి అయిన ఐయూఎంఎల్?కు 5 పోర్టుపోలియోలు దక్కాయి. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు సాదిక్ అలీ, వీడీ సతీశన్ కేబినెట్‌లో చేరనున్న ఐదుగురి పేర్లను ప్రకటించారు. సీనియర్ శాసనసభ్యుడు తిరువంచూర్ రాధాకృష్ణన్‌ను అసెంబ్లీ స్పీకర్‌గా, షానిమోల్ ఉస్మాన్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలని కూడా యూడీఎఫ్ నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ సహా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు హాజరుకానున్నారు. వీరితో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ హాజరయ్యే అవకాశం ఉంది.

## రష్యాపై భారీ డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి..



మాస్కో: భారీ సంఖ్యలోని డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడి చేసింది. భారతీయ కార్మికుడితో సహా నలుగురు మరణించారు. మరో ముగ్గురు భారతీయ కార్మికులు, మరి కొందరు గాయపడ్డారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధృవీకరించింది. దాడి జరిగిన ప్రదేశాన్ని అధికారులు సందర్శించారని, గాయపడిన కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించినట్లు తెలిపింది. 'ప్రాణనష్టం పట్ల రాయబార కార్యాలయం సంతాపం వ్యక్తం చేస్తోంది. భారతీయ కార్మికులకు అవసరమైన సహాయం అందించడానికి కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోంది' అని భారత రాయబార కార్యాలయం ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది.

కాగా, ఆదివారం తెల్లవారుజామున రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు ఉక్రెయిన్ పాల్పడింది. రష్యా రాజధాని మాస్కోలోని కొన్ని ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించాయి. 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 1,000కు పైగా ఉక్రేనియన్ డ్రోన్‌లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

మరోవైపు రాజధాని వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్‌లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల వల్ల పలు ప్రాంతాల్లోని నివాస భవనాలు, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నలుగురు మరణించారని, వీరిలో ముగ్గురు మాస్కో ప్రాంతానికి చెందినవారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోని బెల్గోరోడ్ ప్రాంతంలో మరో మరణం నమోదైనట్లు వెల్లడించారు.

## మోదీజీ.. నీట్ పేపర్ లీకేజీపై సమాధానం చెప్పండి



నీట్ పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధాని మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సూచించారు. ఎక్స్ వేదికగా ఆదివారం ఈ అంశంపై రాహుల్ మరోసారి స్పందించారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మోదీ మౌనంగా ఉండటాన్ని ప్రశ్నించారు. గతంలో కూడా పేపర్ లీకైన తర్వాత కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని రాహుల్ ప్రశ్నించారు. "నీట్ 2024 : పేపర్ లీకైంది. పరీక్ష రద్దైంది. మంత్రి మాత్రం రాజీనామా చేయలేదు. సీబీఐ విచారణ జరిగింది. ఒక కమిటీ ఏర్పడింది. నీట్ 2026 : పేపర్ లీకైంది. పరీక్ష రద్దైంది. మంత్రి ఇప్పటికీ రాజీనామా చేయలేదు. ఎప్పట్లాగే సీబీఐ విచారణ జరుపుతోంది. ఇంకో కమిటీ ఏర్పాటైంది. మోదీజీ.. దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది. వాటికి జవాబివ్వండి. వరుసగా పేపర్ లీకేజీలు ఎందుకు జరుగుతున్నాయి..? పరీక్షపై చర్చలో మీరు ఇంకా ఎందుకు మౌనంగా ఉన్నారు..? వరుసగా పేపర్ లీకవుతున్నా సంబంధిత విద్యాశాఖ మంత్రిని ఇంకా ఎందుకు తొలగించడం లేదు" అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలంటూ హ్యాష్?ట్యాగ్ పెట్టారు.

రెండు రోజుల క్రితం కూడా నీట్ పేపర్ లీకేజీపై రాహుల్ స్పందిస్తూ.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, లేదా దీనికి మోదీయే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాదికి సంబంధించి జరిగిన నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరుగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితుల్ని సీబీఐ అరెస్టు చేసింది.

# గ్రేటర్ పై ధరల భారం..





**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరల పెంపుదల తెలంగాణ బీజేపీకి ఇబ్బందికరంగా మారనుంది. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఈసారి 300 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికల్లో నలభైకి పైగా స్థానాలను గెలుచుకుంది. కానీ ఈసారి ఆ పరిస్థితి ఉండే అవకాశం లేదు. అయితే ఈ సమయంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. లీటర్ పెట్రోలు, డీజిల్ పై 3.04 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ లో పెట్రోలు లీటర్ పెట్రోలు ధర 110.88, లీటరు డీజిల్ ధర 98.96 రూపాయలకు చేరుకుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఇది భారమనే చెప్పాలి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పెట్రోలు, డీజిల్ ధరల భారం పెనుమార్పులు తేనుంది. నిత్యావసరాల ధరలు పెరగడమే కాకుండా కూరగాయల ధరలు కూడా పెరిగే అవకాశముంది. దాదాపు అన్ని ధరలు పెరగనున్నాయి. బియ్యం నుంచి ఉప్పు వరకూ అన్ని ధరలు పెరిగితే అది సామాన్యుడి అసహనానికి కారణమవుతుంది. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఎన్ని పొదుపు సూత్రాలు, మంత్రాలు చెప్పినా ప్రజలకు తమ జేబుల్లో నుంచి డబ్బులు పోతే మాత్రం ఊరికే ఉండరు. తమ అసంతృప్తిని ఓటు రూపంలో ఖచ్చితంగా వెళ్లగక్కుతారన్న ఆందోళన కమలం పార్టీ నేతల్లో కనిపిస్తుంది. ఈ ధరలు పెరుగుదలతో బీజేపీ విజయానికి అడ్డుకట్ట వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. అర్ధరాత్రి ..నెల మధ్యలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్ ధర కూడా ఇటీవల అరవై రూపాయలు పెరగడంతో ఆ ప్రభావం తమ పార్టీపై పడుతుందేమోనన్న భయం బీజేపీ నేతలకు పట్టుకుంది. సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీన పెట్రో ఉత్పత్తుల ధరలను సమీక్ష చేసే చమురు సంస్థలు నెల మధ్యలోనే నిర్ణయం తీసుకుని జనంపై వీర బాదుడు చేశాయి. అదేమంటే గత నాలుగేళ్ల నుంచి ధరలను పెంచలేదంటూ కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంటున్నప్పటికీ, పశ్చిమాసియా యుద్ధం ప్రభావం కారణంగా క్రూడాయిల్ ధరలు పెరిగడంతో చమురు సంస్థలు నష్టాల్లో పడ్డాయని అందుకే ధరలను పెంచకతప్పదని గత కొన్ని రోజులుగా లీకులిస్తున్నాయి. ప్రధాని మోదీ తో సహా పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలంటూ పొదుపు మంత్రం పఠించారు. తాజాగా లీటరు పెట్రోలుపై మూడు రూపాయలు, లీటరు డీజిల్ పై మూడు రూపాయలు అదనంగా వడ్డించి ప్రజల నడ్డి విరిచింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు లీటరు పెట్రోలుపై రెండు రూపాయలు తగ్గించి ఓట్లు పొందిన కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసిన తర్వాత మూడు రూపాయలు అదనపు భారం వేసింది. దీని వల్ల నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగనున్నాయి. ప్రజల కొనుగోలు శక్తిపై కూడా ప్రభావం పడుతుంది. ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు పై 3.29 రూపాయలు, డీజిల్ పై లీటరకు 3.14 రూపాయలు పెంచాయి. తెలంగాణాలో పెట్రోలు, డీజిల్ లీటర్ పై మూడు రూపాయలు పెంచాయి. మెట్రో నగరం కావడంతో ఎక్కువ మంది పెరిగిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఓటెత్తే అవకాశముందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం బీజేపీ ఆశలకు గండి కొట్టినట్లయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# దూరమౌతున్న అనురాగం
# కేటీఆర్, హరీష్ మధ్య గ్యాప్



**హైదరాబాద్ :** తెలంగాణలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ఉడికీ ఉడకని చందంగా తయారైంది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ప్రజా పోరాటాలు నిర్మించడంలో పార్టీ విఫలమవుతోందనే వాదన క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉన్న సమయంలో, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నాయకత్వంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత దూషణలకు, సోషల్ మీడియా వేదికగా సాగే మాటల యుద్ధానికే కేటీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనివల్ల పార్టీకి ఆశించిన మైలేజీ రావడం లేదని అభిప్రాయపడుతున్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఎప్పుడూ ముందుండే ట్రబుల్ షూటర్ హరీష్ రావు పాత్ర ఇప్పుడు బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలన్నా, చెల్లాచెదురవుతున్న క్యాడర్‌ను ఏకం చేయాలన్నా హరీష్ రావుకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని మెజారిటీ శ్రేణులు కోరుకుంటున్నాయి. అయితే, పార్టీలో కేటీఆర్ వర్గానికి, హరీష్ వర్గానికి మధ్య సాగుతున్న కోల్డ్ వార్ వల్ల ఆయనకు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే అసంతృప్తి హరీష్ అనుచరుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు విషయంలో బీఆర్ఎస్ అనుసరించిన వైఖరి పార్టీలో చీలికను తెచ్చింది. రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తిగత అంశాలను అస్త్రంగా చేసుకోవడం పార్టీ ప్రతిష్టను దిగజారుస్తుందని హరీష్ రావు భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఆ విషయంలో ఆయన మౌనం వహించడమే కాకుండా, తన కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకల పేరుతో అమెరికా పయనమయ్యారు. రాజకీయ సెగలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పుడు ఆయన విదేశాలకు వెళ్లడం, అది కూడా కొన్నాళ్ల పాటు అక్కడే ఉంటానని చెప్పడం వెనుక వ్యూహాత్మక మౌనం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఒకప్పుడు కేసీఆర్ మాటే శాసనంగా నడిచిన పార్టీలో, ఇప్పుడు నాయకత్వ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. కేటీఆర్ శైలి కేవలం పట్టణ ఓటర్లను, సోషల్ మీడియాను ఆకట్టుకునేలా ఉందే తప్ప, గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ అనిశ్చితిని గమనిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాల వైపు చూస్తోంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ కేవలం ప్రత్యర్థులను ట్రోల్ చేయడానికే పరిమితమైందని, ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మార్చుకునే కార్యాచరణ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. చెబుతున్నారు. హరీష్ రావు అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాతే పార్టీలో అసలు రంగు బయటపడుతుందని భావిస్తున్నారు. ఆయన తిరిగి వచ్చాక పార్టీ పగ్గాల్లో మార్పులు ఉంటాయా? లేక ఆయన తన దారి తాను చూసుకుంటారా? అనే చర్చ ఇప్పుడు వెబ్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ ఇప్పుడు ఒక కూడలిలో నిలబడింది. కేసీఆర్ మళ్లీ రంగంలోకి దిగి నాయకత్వ మార్పులపై స్పష్టత ఇస్తే తప్ప, గందరగోళంలో ఉన్న క్యాడర్‌ను గట్టెక్కించడం కష్టమేనని కనిపిస్తోంది. అమెరికా నుంచి హరీష్ రావు తిరిగి వచ్చేలోపు తెలంగాణ రాజకీయాల్లో ఇంకెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.

# నీట్ లీక్ ఎఫెక్ట్...
# అన్నీ పరీక్షలపై ప్రభావం



**హైదరాబాద్ :** నీట్ కౌన్సెలింగ్ తర్వాతే పలు ఇతర కోర్సుల ప్రవేశాలు జరపాల్సి ఉండటంతో యేటా విద్యా సంవత్సరం గాడి తప్పుతోంది. ఈ క్రమంలో ఈఏపీసెట్ ఫలితాలు మే నెలలోనే వెలువడినా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబరు వరకు వేచి చూడాల్సి వస్తోంది. అన్ని పరీక్షలు సకాలంలో పూర్తయితేనే ఈఏపీసెట్ పరిస్థితి ఇలా ఉంది. ఇక ఈ ఏడాది నీట్ పరీక్ష రద్దు అవడంతో పలు ప్రవేశాల ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మే 4న నీట్ నిర్వహించగా.. జూన్ 14న ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా నీట్ ర్యాంకు ఆధారంగా రాష్ట్ర ర్యాంకు కేటాయిస్తారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ మొదలవుతుంది. రాష్ట్ర నీట్ కౌన్సెలింగ్ రెండు, మూడు దఫాలు పూర్తయిన తర్వాత ఈఏపీసెట్ అగ్రికల్చర్ విభాగం ప్రవేశాలు మొదలుపెడుతుంది. కాళోజీ హెల్త్ వర్సిటీల ఆధ్వర్యంలో తొలుత నీట్ కౌన్సెలింగ్ ఆ తర్వాత వెటర్నరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలు జరుపుతారు. చివరగా బీఫార్మసీ, ఫార్మా–డి కౌన్సెలింగ్ మొదలవుతుంది. గత ఏడాది నీట్ సవ్యంగా జరిగితేనే ఫార్మా కౌన్సెలింగ్ అక్టోబరు 5న మొదలైంది. చివరి విడత కౌన్సెలింగ్ అక్టోబరు 23తో పూర్తయింది. ఈ సారి నీట్ రద్దు కావడంతో ఈ ప్రవేశాలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇక బీ ఫార్మసీ, ఫార్మా–డి కోర్సులకైతే నవంబరు వరకు ప్రవేశాలకు ఎదురు చూడాల్సిందే. ఈ కౌన్సెలింగ్‌లు అన్నీ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉండటంతోనే ఈ జాప్యం నెలకొంటుంది. ఒక కోర్సులో చేరిన తర్వాత డిమాండ్ ఉన్న మరో కోర్సులో సీటు వస్తే.. తొలుత సీటు పొందిన కాలేజీలు ఫీజు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడం లేదు. దీంతో ఆ ఫీజును వదులు కోవడమో.. మెరుగైన సీటు కోల్పోవడమో జరుగుతుంది. అందుకే విద్యాశాఖ అధికారులు సైతం ఒక కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మరొకటి నిర్వహిస్తున్నారు. ఈసారి మళ్లీ నీట్ నిర్వహించి, ఫలితాలు వెల్లడించడానికి కనీసం 2 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ ప్రకారంగా చూస్తే ప్రవేశాల కౌన్సెలింగ్‌లు మరింత ఆలస్యమవుతాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటే తప్ప కొత్త విద్యాసంవత్సరం కొలిక్కిరాదని నిపుణులు భావిస్తున్నారు.

## బండి సంజయ్ కేంద్రమంత్రిగా కొనసాగడం దేశానికే అవమానం

-మొదటిపేజీ తరువాయి

ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని కేటీఆర్ విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ని మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు తొమ్మిది రోజులపాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికేగాక దేశానికే అవమానమని మండిపడ్డారు.

## బండి భగీరథ్‌తో పార్టీకి సంబంధం లేదు

-మొదటిపేజీ తరువాయి

ఏమాత్రం తగ్గించడం లేదన్నారు. అయితే కేంద్రమంత్రి బండిసంజయ్ కుమారుడు బండి భగీరథ్ నిన్న (శనివారం) పోలీసుల ఎదుట లొంగిపోయారు. అనంతరం మేడ్చల్ మేజిస్ట్రేట్ ఎదుట ఆయనను హాజరుపరచగా న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో భగీరథ్ ను చర్లపల్లి జైలుకు తరలించారు. కాగా ఈ విషయంపై స్పందించిన బండి సంజయ్.. తన కుమారుడు ఎటువంటి తప్పు చేయలేదని చెబుతున్నాడని అందుకే పోలీసుల ఎదుట లొంగిపోయారన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాల్సిందేనని తెలిపారు

## అక్రమ ఓటర్లకు 'సర్'తో చెక్

-మొదటిపేజీ తరువాయి

ఎపిక్ నంబరు, సీరియల్ నంబరు, ఓటరు పాత ఫొటో, క్యూఆర్ కోడ్ ముందే ముద్రించి ఉంటాయి. ఓటరు పాత ఫొటో (ముద్రించి ఉన్న) పక్కన ఓటరు ప్రస్తుత తాజా ఫొటోను అతికించాల్సి ఉంటుంది.

మొదటి కాలమ్‌లో 2002 ఎస్ఐఆర్‌లో ఓటరు జాబితాలోని ఓటరు వివరాలు అందించాలి. వ్యక్తి పేరు, ఎపిక్ నంబరు, రాష్ట్రం, జిల్లా, శాసనసభ నియోజకవర్గం, సీరియల్ నంబరు, పార్ట్ నంబరును తెలిపాలి. రెండో కాలమ్‌లో ఓటరుకు మొదటి కాలమ్‌లో ఓటరుతో (గత ఎస్ఐఆర్ జాబితాలో పేరున్న) ఉన్న బంధం గురించి వివరించాలి. తర్వాత కాలమ్‌లో ఓటరు పుట్టిన తేదీ వివరాలు, ఆధార్ నంబరు (ఆప్షనల్), వ్యక్తి ఫోన్ నంబరు, తల్లి పేరు, తల్లి ఎపిక్ నంబరు (తెలిస్తే), తర్వాత తండ్రి పేరు, తండ్రి ఎపిక్ నంబరు (తెలిస్తే), భాగస్వామి పేరు (భార్య లేదా భర్త), భాగస్వామి ఎపిక్ నంబరు (తెలిస్తే) వివరాలను అందించాలి. ఇదే తరహాలో రెండో ఫారంను కూడా నింపాలి. వీటిలో ఒకటి రసీదుగా మన వద్దే ఉంచుకోవాలి. మరొకటి బీఎల్‌వో అధికారికి అందజేయాలి.

ముందే పత్రాలు అవసరం లేదు

ఎన్యుమరేషన్ సమయంలో బీఎల్?వోలకు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. జులై 31న ముసాయిదా జాబితా ముద్రించిన తర్వాత అధికారులకు ఓటరుపై ఏమైనా అనుమానం కలిగితే నోటీసులు జారీ చేస్తారు. ఈ రకంగా నోటీస్? జారీ చేస్తే అప్పుడు అర్హతను నిరూపించుకునేందుకు సంబంధిత పత్రాలను చూపించాలి. ఈసీఐ సూచించిన గుర్తింపు పత్రాలు ఇలా ఉన్నాయి.

గుర్తింపు పత్రాలివే :

ఉద్యోగులు లేదా పెన్షనర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు/ పీఎస్?యూలు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పెన్షన్ పేమెంట్? ఆర్డర్? (పీపీవో)

01-07-1987కు ముందు ప్రభుత్వ సంస్థలు / పోస్టుఆఫీసులు / ఎల్?ఐసీ / బ్యాంకులు / స్థానిక సంస్థలు అందిచే గుర్తింపు పత్రాలు

ప్రభుత్వం నిర్దేశించిన అధికారితో జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం

పాస్?పోర్టు

గుర్తంపు పొందిన బోర్డులు/ విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్? లేదా ఇతర విద్యార్హత పత్రాలు

సంబంధిత అధికారి జారీ చేసిన శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం

అటవీహక్కుల పత్రం

కుల ధ్రువీకరణ పత్రం

జాతీయ పౌర పట్టిక (ఎక్కడైనా అమలులో ఉంటే)

స్థానిక సంస్థలు లేదా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఫ్యామిలీ రిజిస్టర్? పత్రం

ప్రభుత్వం కేటాయించిన భూమి/ ఇంటి పత్రాలు

ఆధార్? కార్డు (కమిషన్ నిర్దేశించిన నిబంధనలు వర్తిస్తాయి)

చివరి సారిగా 2002లో సర్ సర్వే నిర్వహించారు. నాటి ఓటరు జాబితాను ప్రక్షాళన చేశారు. ఇదే రీతిలో ఓటు హక్కు కలిగి ఉన్న అక్రమ వలసదారులు, శరణార్థులు, విదేశీయులను ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. వీరితో పాటు ఒకే వ్యక్తి స్వగ్రామంతో పాటు రాజధాని నగరంలోనూ లేదా దేశంలో ఇతర ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉంటే అలాంటి వారిని ఓటరు లిస్టు నుంచి తొలగిస్తారు. ఇలా అక్రమంగా ఓటరుగా గుర్తింపు పొందిన వారికి 'సర్'తో చెక్ పెట్టవచ్చు.

## గులాబీ మిషన్ 2028

-మొదటిపేజీ తరువాయి




పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి సభ్యత్వాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుంచి సభ్యుల సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తారు. దీనివల్ల క్షేత్రస్థాయి కార్యకర్తకు, పార్టీ అధిష్టానానికి మధ్య మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంబంధం ఏర్పడుతుంది. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమన్వయకర్తలను నియమించి, పార్టీ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచనున్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. రైతు రుణమాఫీలో జాప్యం, ధరణి పోర్టల్ సమస్యలు, నిరుద్యోగ భృతి వంటి హామీల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గతంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల కంటే, ఈసారి ప్రజలతో నేరుగా మమేకమయ్యేలా 'జన చైతన్య యాత్రల'కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామాల వారీగా తిరుగుతూ, ప్రజల సమస్యలపై పోరాడటం ద్వారానే పూర్వ వైభవం సాధ్యమవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు. పదేళ్ల అధికార కాలంలో నాయకులకు, సాధారణ కార్యకర్తలకు మధ్య ఏర్పడిన దూరాన్ని గుర్తించిన కేసీఆర్, పార్టీ నిర్మాణంలో భారీ మార్పులు సూచించారు. కేవలం నాయకుల చుట్టూ తిరిగే పార్టీగా కాకుండా, క్షేత్రస్థాయి కార్యకర్తలే నిర్ణయాత్మక శక్తిగా ఉండేలా క్యాడర్ డ్రివెన్ వ్యవస్థగా బీఆర్ఎస్ రూపాంతరం చెందబోతోంది. ప్రతి కార్యకర్తకు రాజకీయ భద్రత కల్పించడంతో పాటు, కష్టకాలంలో పార్టీ కుటుంబంలా అండగా ఉంటుందనే భరోసా ఇచ్చేలా సంస్థాగత రక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. బీఆర్ఎస్ పునర్నిర్మాణం కేవలం కమిటీల మార్పుకే పరిమితం కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని, అభివృద్ధిని మళ్లీ చర్చలోకి తెచ్చే ప్రయత్నమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 'రీక్లెయిమింగ్ తెలంగాణ' అనే నినాదంతో, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా బీఆర్ఎస్‌ను మళ్ళీ నిలబెట్టాలని కేసీఆర్ సంకల్పించారు. మొత్తంగా, ఎర్రవెల్లి భేటీ బీఆర్ఎస్ పార్టీలో నిస్తేజాన్ని వదిలించుకుని ఒక శక్తివంతమైన ప్రతిపక్షంగా అసెంబ్లీలోనూ, వీధుల్లోనూ పోరాడేందుకు అవసరమైన పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. రాబోయే రెండేళ్ల కాలానికి కేసీఆర్ నిర్దేశించిన ఈ రోడ్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## సంపాదకీయం

# అస్పష్ట శిఖరాగ్రం!

దశాబ్దకాలంగా ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక, ఇంధన రంగాల్లో పరస్పరం తలపడుతూ, వాటితోపాటే ఒకదానిపై మరొకటి అవిశ్వాసాన్ని దండిగా పెంచుకున్న రెండు అగ్ర రాజ్యాలు చర్చలకు సిద్ధపడ్డాయంటే ప్రపంచం చాలా ఆశిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారం బీజింగ్ చేరుకున్నప్పుడు ఆయనకు లభించిన స్వాగత సత్కారాలు గమనించినా, శిఖరాగ్ర సమావేశం జరిగిన గురు, శుక్రవారాల్లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై ఆయన కురిపించిన ప్రశంసలు చూసినా అంతా సవ్యంగా ముగిసిందని అనిపిస్తుంది. ట్రంప్‌తో వచ్చిన ప్రతినిధి బృందం సామాన్యమైనది కాదు. భిన్నరంగాల్లో ప్రపంచాన్నేలుతున్న దిగ్గజ సంస్థల చీఫ్‌లు 16 మంది ఆ బృందంలో ఉన్నారు. టెస్లా, స్పేస్ ఎక్స్‌ల సీఈఓ ఎలాన్ మస్క్, యాపిల్ చీఫ్ టిమ్ కుక్‌లతోపాటు ఎన్‌విడియా, క్వాల్‌కామ్, బ్లాక్‌రాక్, గోల్డ్‌మాన్ శాక్స్, బోయింగ్, మెటా సంస్థల సీఈఓలు వారిలో కొందరు. చైనాతో అద్భుతమైన ఒప్పందాలు కుదిరాయనీ, అవి ఇరు దేశాలకూ ఎంతో గొప్పవనీ ట్రంప్ ప్రకటించినా ఆ ఒప్పందాల వైనమేమిటో ఎవరికీ తెలియదు. బోయింగ్ సంస్థకు చెందిన 200 జెట్ విమానాలు వెంటనే, భవిష్యత్తులో మరో 750 కొనడానికి చైనా అంగీకరించిందనీ... అలాగే వందలకోట్ల డాలర్ల విలువైన సోయాబీన్స్ కొనుగోలు చేయడానికి కూడా ఒప్పుకున్నదనీ ట్రంప్ చివరిలో వివరించారు. కానీ అందుకు సంబంధించి ఎలాంటి ప్రకటనలూ రాలేదు. లిఖితపూర్వక ఒప్పందాలు కుదిరిన దాఖలా లేదు. ప్రాథమిక చర్చలవరకూ జరిగి ఉంటాయన్నది దౌత్యరంగ నిపుణుల అభిప్రాయం. ఇరు దేశాలమధ్యా సాగిన సుంకాల యుద్ధం సామాన్యమైనది కాదు. ట్రంప్ సుంకాలు ప్రకటించిన ప్పుడల్లా చైనా దీటుగా స్పందించి ప్రతీకార సుంకాలు విధిస్తూ పోయింది. అరుదైన ఖనిజాల ఎగుమతుల్ని చైనా నిలిపేయటంతో అమెరికా విలవిల్లా డింది. ఇక కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో ఆధిపత్యం కోసం రెండూ హోరాహోరీ పోటీ పడుతున్నాయి. ఎన్‌విడియా అత్యాధునిక చిప్‌లు కావాలని చైనా కోరుతుండగా భద్రతా కారణాల రీత్యా కుదరదన్నది అమెరికా వాదన. బహుశా చైనా ఆశలు ఈడేరకపోవటంవల్ల... కొన్ని అంశాల్లో పట్టు సడలించటానికి అమెరికా నిరాకరించటంవల్ల ఒప్పందాలపై ప్రాథమిక చర్చలే సాగాయని అనుకోవాలి. కనీసం వచ్చే సెప్టెంబర్‌లో షీ అమెరికా పర్యటన నాటికైనా స్పష్టత వస్తే మంచిదే. ప్రపంచం మునుపటి తీరుగా లేదని మాత్రం ట్రంప్‌కు అర్థమై ఉంటుంది. ఎందుకంటే తైవాన్ విషయంలో తమకంటూ ఒక 'రెడ్‌లైన్' ఉన్నదని షీ జిన్‌పింగ్ నిర్మొహ మాటంగా చెప్పారని మీడియా అంటున్నది. అయితే తైవాన్‌పై గత వైఖరే కొనసాగుతుందని ట్రంప్‌తో వచ్చిన అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో చెప్పటం మినహా మరేదీ బయటకు రాలేదు. తమ సొంతమని చైనా చెబుతున్న తైవాన్‌ను స్వతంత్ర, స్వయంపాలిత, ప్రజాస్వామిక దేశంగా మనుగడ సాగించనీయాలన్నది అమెరికా వాదన. 1979 నుంచి దానితో సంబంధాలు నెరపుతున్నా అవన్నీ 'అనధికారమైనవి'. కానీ తైవాన్‌కు ఆయుధ విక్రయం జరపాలని ఇటీవల అమెరికా అనుకోవటాన్ని చైనా తీవ్రంగా పరిగణిస్తోంది. అందుకే ఈ 'రెడ్‌లైన్' హెచ్చరిక. ఇక ఇరాన్ యుద్ధం, హోర్ముజ్ జలసంధివద్ద ఉద్రిక్తతలపైనా ఇరు దేశాలూ ఒకే అభిప్రాయంతో ఉన్నట్టు పైకి అంటున్నా వాటిపైనా స్పష్టత లేదు. ఈ పర్యటన తర్వాత హోర్ముజ్ వద్ద సామరస్యత ఏర్పడు తుందేమో చూడాలి. దౌత్య పరిభాషలో మర్యాదపూర్వకమైన పదాలు చాలా ఉంటాయి. అందులో రెండు దేశాలమధ్యా కుదిరిందని చెబుతున్న విజన్ కొత్తది. 'నిర్మాణాత్మక వ్యూహాత్మక స్థిరత్వం' అనే ఈ విజన్ అర్థం 'పూర్తిగా స్నేహితులం కాలేకపోయినా, శత్రువులుగా మారి యుద్ధా నికి దిగొద్దు' అన్నదే. సారాంశంలో పూర్వపు సోవియెట్ అధినేత కృశ్చేవ్ బోధించిన 'శాంతియుత పోటీ' వంటిది. నిజానికి ట్రంప్ పర్యటన ఆంతర్యం ఇదే. తమతో సరి సమాన స్థాయికి ఎదిగిన చైనాతో ఇరాన్, తైవాన్ ల విషయంలో స్పర్థ రాకూడదని ఆయన కోరుకుంటున్నారు. ఆ పరిమితుల్లో చూస్తే ట్రంప్ పర్యటన విజయవంతమైందను కోవాలి. కానీ ట్రంప్ ఏలుబడిలో అమెరికా ఏ మేరకు ఒదిగి ఉంటుంది... చైనా ఏ స్థాయి వరకూ తగ్గివున్నట్టు కనబడుతుందన్నది రానున్న కాలమే చెబుతుంది.

# డాలర్ స్థానంలో బ్రిక్స్




ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త రకమైన 'క్యూ' కనిపిస్తోంది. ఒకప్పుడు అమెరికా డాలర్ కనిపిస్తే చాలు జోహార్లు అర్పించిన దేశాలన్నీ, ఇప్పుడు 'మాకు ఈ డాలర్ వద్దు.. బ్రిక్స్ దోస్తీ ముద్దు' అంటూ ఆ దేశాల కూటమి ముందు క్యూ కడుతున్నాయి. ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసిన ఏప్రిల్, 2026 గణాంకాలను చూస్తుంటే, ఇది కేవలం ఒక కూటమిలా కాకుండా.. అమెరికా, యూరప్ దేశాలకు నిద్రలేకుండా చేసే ఒక 'ప్రత్యామ్నాయ ప్రపంచం'లా కనిపిస్తోంది. చైనా భారీ జీడీపీ నుంచి మొదలుకొని, పాలస్తీనా వంటి చిన్న దేశాల వరకు అందరూ ఈ క్లబ్‌లో మెంబర్‌షిప్ కోసం తహతహలాడుతుండటం చూస్తుంటే.. భవిష్యత్తులో వైట్ హౌస్ కంటే 'బ్రిక్స్' ఆఫీసు ముందే రద్దీ ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది.బ్రిక్స్ సభ్య దేశాల జీడీపీ లెక్కలు చూస్తుంటే, చైనా ఏకంగా వి20.85 ట్రిలియన్లతో అందనంత ఎత్తులో కూర్చుంది. దానికి పోటీగా భారతదేశం కూడా వి4.15 ట్రిలియన్లతో తన సత్తా చాటుతోంది. ఈ రెండు దేశాలు కలిస్తేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా వాటా ఉండేలా ఉంది. బ్రెజిల్, రష్యా కూడా చెరో రెండున్నర ట్రిలియన్లతో తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక్కడ ఒక వింత ఉంది.. ఒకవైపు రష్యాపై ఇన్ని ఆంక్షలు ఉన్నా, దాని జీడీపీ మాత్రం నిలకడగా ఉండటం పాశ్చాత్య దేశాలకు మింగుడుపడని నిజం. సంక్షేమ పథకాలు, అప్పులతో కుస్తీ పడుతున్న దక్షిణాఫ్రికా, ఈజిప్ట్ వంటి దేశాలు కూడా ఈ భారీ ఇంజన్ల అండ చూసుకునే ధైర్యంగా అడుగులు వేస్తున్నాయి. ఈ జాబితాలో ఇండోనేషియా (వి1.54 ట్రిలియన్) వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు పూర్తి సభ్యులుగా మారుతుంటే, పాకిస్థాన్ (వి410 బిలియన్), శ్రీలంక (వి98 బిలియన్) వంటి దేశాలు మాత్రం దరఖాస్తు పట్టుకొని దీనంగా ఎదురు చూస్తున్నాయి. పాకిస్థాన్ పరిస్థితి చూస్తుంటే.. 'సభ్యత్వం ఇస్తే ఇయ్యండి కానీ, ముందు ఏవైనా లోన్లు ఉంటే చూడండి' అని అడిగేలా ఉంది. అప్పుల ఊబిలో ఉన్న దేశాలన్నీ బ్రిక్స్‌ను ఒక 'ఏటీఎం'లా చూస్తుంటే, అసలు సభ్య దేశాలు మాత్రం దీన్ని ఒక 'పొలిటికల్ వెపన్' (రాజకీయ ఆయుధం)లా వాడుకోవాలని ప్లాన్ చేస్తున్నాయి. ఇక సౌదీ అరేబియా లాంటి ధనిక దేశాలు కూడా చేరితే, బ్రిక్స్ దగ్గర ఆయిల్ కు, డబ్బుకు అస్సలు కొదవ ఉండదు. నైజీరియా నుంచి వియత్నాం వరకు దాదాపు 10 దేశాలు భాగస్వామ్య హోదాలో ఉంటూ లోపలికి రావడానికి గేట్ల దగ్గర వేచి చూస్తున్నాయి. వియత్నాం (వి527 బిలియన్), మలేషియా (వి516 బిలియన్) వంటి ఆగ్నేయాసియా పులులు ఈ కూటమిలో చేరితే, ఇక ఆసియా ఖండం మొత్తం బ్రిక్స్ గుప్పిట్లోకి వెళ్లడం ఖాయం. ఒకప్పుడు అభివృద్ధి చెందిన దేశాల జీ–7 (ఉ7) గ్రూపును చూసి భయపడిన ప్రపంచం, ఇప్పుడు బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్+) వైపు ఆశగా చూస్తోంది. ఈ కూటమిలో డేటా లేని క్యూబా, సిరియా వంటి దేశాలు కూడా ఉన్నాయంటే, ఇక్కడ ఆర్థిక స్థితి కంటే 'అమెరికా వ్యతిరేకత' అనే గూడు పుఠాణీనే ఎక్కువగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. చిన్న దేశాల 'పెద్ద' కలలు కేవలం వి3.49 బిలియన్ల జీడీపీ ఉన్న సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నుంచి, అంతర్యుద్ధాలతో అల్లాడుతున్న ఆఫ్ఘనిస్తాన్ వరకు అందరూ ఈ జాబితాలో ఉన్నారు. వీరందరికీ బ్రిక్స్ లో చేరడం అంటే ఏదో మంత్ర దండం దొరికినట్లే అన్నంత ఆశ ఉంది. చైనా ఇచ్చే పెట్టుబ డులు, భారత్ ఇచ్చే సాంకేతికత తమ దేశాలను మార్చేస్తా యని వారు నమ్ముతున్నారు. అయితే, ఇంత మంది ఒకే గూటి కింద చేరితే.. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చుతాయా? లేక ఇది కేవలం ఫోటో షూట్లకే పరిమితం అవుతుందా? అన్నది భవిష్యత్తు తేల్చాలి. మొత్తానికి, బ్రిక్స్ విస్తరణ చూస్తుం టే.. 'డబ్బు ఉన్నవాడు, అప్పు ఉన్నవాడు, యుద్ధం చేస్తున్న వాడు.. అందరూ కలిశారు. ఇక డాలర్ గారే జాగ్రత్తగా ఉండాలి' అనిపిస్తోంది. ఐఎంఎఫ్ రిపోర్ట్ ప్రకారం ఈ కూటమి ఇలాగే పెరిగితే, ఇక ప్రపంచం ఢిల్లీ–బీజింగ్ చుట్టూ తిరగడం ఖాయం!

# కలగాపులగం పార్టీలు అవసరమా?



2014 మే నుంచి దేశ రాజకీయ వికృత క్రీడలు, విలువల హననం, ప్రత్యర్థులనుకున్న వాళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం ఒకళ్లకు ఒకళ్లు సహాయం చేసుకోవటం, ముఖ్యంగా జాతీయ పార్టీలుగా వెలుగుతున్నవి ప్రాంతీయ పార్టీలను ఓడించుకోవ టం కోసం రాజ్యాంగ విలువలను, ఎన్నికల నిర్వహణా కార్యక్రమంలో సిద్ధాంతాలను వదిలేయటం మొదలైన ప్రక్రియలన్నీ ప్రజలంతా గమనిస్తున్నారు. దేశంలోని మేధావులు, ప్రగతి కోరుకునేవారు చాలా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎవరైనా ఏ పార్టీ మౌలిక సిద్ధాంతాలు ఏమిటి అని స్పష్టంగా చెప్పాలంటే ఈ విధంగా జవాబులివ్వాల్సి వస్తుంది.

భారతీయ జనతా పార్టీ: కేవలం రాజకీయ లబ్ధి, అధికారం మాత్రమే ధ్యేయంగా పని చేసే పార్టీ. ఈ నాయకులకు రెండే పనులు ముఖ్యం. ఇంకా 6, 8 నెలల్లో ఏ రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చేటట్టు ఉన్నా, ఇక ఆ రాష్ట్రాల మీదే వారి దృష్టి. అక్కడ తమ పార్టీ అధికారంలో ఉంటే ప్రత్యర్థి పార్టీలకు మద్దతు తెలిపే ఓటర్లను ఎలా తిప్పుకోవాలి అనేది ఆ పార్టీ నైజం. ఏదైనా ఒక రాష్ట్రంలో బలమైన పార్టీ, లేక ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్న పార్టీతో పొత్తులు పెట్టుకొని, ఆ పార్టీని చీల్చో, నిర్వీర్యం చేసో, తర్వాత ఎన్నికల్లో పైచేయి సాధించటం. 2014లో కేంద్ర ప్రభుత్వాన్ని చేజిక్కించుకోకముందు బీజేపీ కేవలం 5 రాష్ట్రాల్లో (చిన్న గోవా కూడా కలుపుకొని) మాత్రమే అధికారంలో ఉండింది. 2014 నుంచి 2026 లోపల ఆ సంఖ్య 17కు పెరిగిందంటే ఇక ఆ పార్టీ ఎన్ని రకాల అక్రమాలు చేసి ఉండవచ్చో అర్థం చేసుకోవచ్చు. తమాషా ఏమిటంటే తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలకైనా న్యాయమైన పరిపాలన అందించటం ఈ పార్టీ ధ్యేయం కాదు. కేవలం రాష్ట్రాలను కైవసం చేసుకొని అక్కడి సంపద అంతా గుజరాతీ పారిశ్రామికవేత్తలకు దోచిపెట్టడమే ఆశయంగా పెట్టుకున్నదీ పార్టీ. ఇంకో ముఖ్యమైన పని మైనారిటీలను భయభ్రాంతులను చేయటం బీజేపీ ఆశయం.

కాంగ్రెస్ పార్టీ: ఇది ఒక అత్యంత దయనీయమైన స్థితిలోకి జారిపోయింది. 'మా తాతలు నేతులు తాగారు' అంటూ కుటుంబంలోని పూర్వనేతల వైభవాన్ని పొగుడుకుంటూ ఓట్లడుగుతున్నది. ఇందిరాగాంధీ తర్వాత రాజకీయాలు నడపగలిగే శక్తిలేని కుటుంబ సభ్యులు, కాస్త వారి పార్టీలో తెలివైన వాళ్లు ఉంటే వారిని తొక్కేయటం వంటి విన్యాసాలు చేసి, ఉన్న కొద్దిమంది మేధావులను పోగొట్టుకున్నది. అంతేకాదు, వారు చెప్పేవారి పూర్వీకుల మరణాలు కూడా వారి గొప్ప పనుల వల్ల జరగలేదు. స్వయంగా తాము చేసిన చేష్టలకు వారు బలయ్యారు.

నెహ్రూ భారత్ మీద చైనా యుద్ధం చేసిందన్న దిగులుతో చనిపోయాడని ప్రచారం చేశారు. కానీ నెహ్రూ 27 మే 1964న మరణించారు. అసలు కారణం ఏమిటంటే, చదువుకోమని లండన్ పంపిస్తే, 18 ఏండ్ల సంజయ్ గాంధీ (ఇందిరా గాంధీ రెండవ కుమారరత్నం) ఓ కేసులో అరెస్ట్ అయ్యారు. ఫోన్ రాగానే నెహ్రూకు హార్ట్ ఎటాక్ వచ్చిందని ఓ విషయం ప్రచారంలో ఉన్నది. ఆ కుటుంబంలోని అతి ధైర్యవంతురాలైన రాజకీయవేత్త ఇందిరాగాంధీ. నిజానికి ఆవిడ పాలనలోనే భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది. కానీ బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం ఇప్పించిన మంచి పనులతోపాటు, ఉగ్రవాదులను పెంచి పోషించారు. చివరకు గోల్డెన్ టెంపుల్‌లో దాక్కున్న వారిని మిలిటరీ వాళ్లు చంపటంతో సిక్కు మతస్థులకు ఆగ్రహం వచ్చింది. దానికి సమాధానంగా 1984న ఆమెను చంపేశారు.

ఇక రాజీవ్‌గాంధీ తనకు అవసరంలేని శ్రీలంక విషయంలో కల్పించుకున్నారు. నిజానికి శ్రీలంకలో తమిళులకు, ఆ దేశస్థులైన సింహళీయులకు జరిగిన అంతర్యుద్ధం ఆపటానికి చర్చలు జరిపి శాంతి సైన్యాన్ని పంపాలన్నారు రాజీవ్‌గాంధీ. కానీ తెలంగాణలో 1948–1952 మధ్య ప్రవర్తించినట్టే భారత సైన్యం అక్కడ ఉన్న తమిళులను వేధించింది. శాంతి స్థాపించకుండా, తమిళ కుటుంబాలను అన్ని రకాలుగా బాధించింది. నిజానికి భారతదేశంలో కూడా ఈ సైన్యాన్ని పంపిన చర్యను నిరసించారు ప్రజలు. రాజీవ్‌గాంధీ తన పూర్తి క్యాబినెట్‌ను సంప్రదించకుండా చేసిన చర్య అది. దానితో మార్చి 1991న తమిళ ఆత్మాహుతి దళ సభ్యులు బాంబులతో హత్యచేశారు. ఇక తర్వాత ఆయన తమ్ముడు ఆయన కంటే ముందే 23 జూన్ 1980లో చనిపోవటంతో ఇక ఆ కుటుంబంలోని వ్యక్తులకు ప్రధాని పదవి దూరమైనదనే చెప్పాలి. అప్పటి నుంచి (అంతకుముందు ఆ పార్టీ అవినీతి గురించి మనకు స్పష్టమైన ఆధారాలు లేవు) కాంగ్రెస్ పార్టీ అవినీతి బలహీనతకు గురైంది. వేరేవారు కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలోకి రావటంతో ఒక అభద్రతా భావంతో దేశంలోని అవినీతిని నియంత్రించకుండా, తానే అవినీతికి పాల్పడింది. ఆ క్రమంలో దేశ గ్రహచారం బాగులేక మతమౌఢ్య సిద్ధాంతాలు కలిగిన ఆర్ఎస్ఎస్ అండదండలతో ఒక పార్టీ అవతరించింది. మొదట 1951లో భారతీయ జనసంఘ్‌గా ఏర్పడి, 1977లో జనతా పార్టీ అన్నదానితో కలిసింది. అయితే గొప్ప రాజకీయవేత్త, మానవీయత కలిగిన నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో 6 ఏప్రిల్ 1980న ప్రస్తుత బీజేపీ ఏర్పడింది. నిజానికి కాంగ్రెస్ అవినీతికి, ఆర్ఎస్ఎస్ మత మౌఢ్యానికి ప్రజలు బలికాకుండా, సుఖశాంతులతో బతకాలని, దేశం ప్రగతి చెందాలని, ఆశించి వాజ్‌పేయి రూపొందించిన పార్టీ బీజేపీ!

ఇక ప్రస్తుత పరిస్థితికి, ప్రజలు అవగాహన పెంచుకొని ఎట్లా ఈ పరిస్థితులను ఎదుర్కోవాలో చూద్దాం. ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ అనే విడివిడి పార్టీలు ఏమీ లేవు. వాళ్లందరూ ఒక్కటే. ప్రత్యర్థి పార్టీలను నాశనం చేసి తామే ఉండాలనుకొనే బీజేపీ సిద్ధాంతం ఎంత ప్రమాదకరమో, ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ అవినీతి, అసమర్థత అంతే ప్రమాదం. పైగా ఏ రాష్ట్రంలో అయినా స్థానిక పార్టీలకు ఉన్న అవగాహన ఉత్తరాదిని మాత్రం తమది అనుకొనే ఈ కేంద్ర పార్టీలకు ఉండదు.

ఆరు దశాబ్దాల తెలంగాణ బాధితులను పట్టించుకోకుండా 'తల్లిని చంపి పిల్లకు జన్మనిచ్చారు' అని రాష్ట్ర విభజన సమయంలో మోదీ చేసిన మూర్ఖపు వాదన తెలంగాణ ప్రజలు మర్చిపోకూడదు. అంతేకాదు, 54 ఏండ్లు కాంగ్రెస్ పాలనలో జరిగిన దోపిడీ, వివక్ష కూడా తెలంగాణ ప్రజలు మర్చిపోకూడదు. ఒకసారి కాంగ్రెస్ పార్టీని గమనించాక, దానికి ఓట్లేసి గెలిపించడం వింత అజ్ఞానం! అంతేకాదు తెలంగాణ నుంచి కొల్లగొట్టిన సంపదతో బలిసి, ఇక్కడ స్థిరపడి, ఇంకా తెలంగాణ పార్టీకి, ప్రజలకు ద్రోహం చేయాలని, పెత్తనం సాగించాలని చూసే ఈ ఆంధ్రులు మద్దతు పలికే ఈ 2 జాతీయ పార్టీలు, టీడీపీని తెలంగాణ పూర్తిగా విస్మరించాలి.తెలంగాణ సమాచారం

అంతేకాదు, నిజానికి ఇప్పుడు పైన చెప్పిన మూడు పార్టీలు ఒకటే పార్టీ, అదే తెలంగాణ వ్యతిరేక పార్టీ (టీవీపీ) కాంగ్రెస్‌లోను, ఇతర చిన్నాచితక, ప్రాంతీయ పార్టీల్లోనూ ఉన్న సంపన్నులైన నాయకుల మీద అవినీతి కేసులు మోపి, భయపెట్టి బీజేపీలో చేర్చుకునే మోదీ, షా తంత్రం వల్ల ఇప్పుడు ఆ పార్టీలో 95 శాతం అవినీతిపరులే ఉన్నారు. ఇక కాంగ్రెస్ వెంటిలేటరు మీద ఉన్న పార్టీ, దక్షిణాది వారు బీజేపీ మీద వ్యతిరేకతతో కాంగ్రెస్‌ను గెలిపిస్తున్నారు గతిలేక, దక్షిణాది రాష్ట్రాల వారు తమ ప్రాంతీయ పార్టీలను గెలిపించుకొని ఉత్తరాది దాష్టీకాన్ని ఎండగట్టాలి.

ఇటీవల జరిగిన తమిళనాడు ఎన్నికలలాగ ప్రజలంతా తమకు మేలు చేసే నాయకుడు ఉన్న పార్టీని ఎన్నుకోవాలి. బీజేపీ, కాంగ్రెస్ ఇంకా తమిళనాడులో అధికారం చేపట్టిన కొత్త పార్టీకి ఎన్ని గండాలు కల్పిస్తారో. ప్రజాస్వామ్యంలో నిజాయతీగా ఉండవలసిన న్యాయస్థానాలను, ఎన్నికల సంఘాన్ని, గవర్నర్ వ్యవస్థను నిర్వీర్యం చేసి నాటకాలాడే ఈ రెండు పార్టీల పాలన ఇక చాలు. నిజానికి అవి రెండు పార్టీలు కావు, ఒకటే. అవినీతి, అక్రమాల జాతీయ పార్టీలు. తెలంగాణలో 800 నాటి గుడిని కూలగొడితే హిందుత్వ పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ దానిని వ్యతిరేకించదు. బీజేపీ నాయకుడి కొడుకు మీద కేసు వస్తే రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ నేతలు ప్రభుత్వం స్పందించరు. తెలంగాణ రాష్ట్రం మీద పార్లమెంట్‌లో కొందరు అవాకులు, చెవాకులు వాగుతుంటే తెలంగాణ నుంచి గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు అక్కడే కూర్చుండి ఎందుకు నోరు మెదపలేదు? ఇలాంటి నేతలు అవసరమా మన రాష్ట్రానికి? ఇకనైనా తెలంగాణ ప్రజలు ఈ కలగాపులగం పార్టీలను తరిమికొట్టి, తెలంగాణ రాష్ట్రానికి మంచి చేసే వారిని ఎన్నుకోవాలి. ఊరికే మన ముఖ్యమంత్రిలాగా పొంకణాలు కొట్టేవారిని కాదు, నిజంగా గతంలో మంచి చేసి తెలంగాణ రాష్ట్రాన్ని నిలబెట్టిన వారిని ఎన్నుకొని సుఖపడాలి. చూద్దాం. కాంగ్రెస్ పాలనలో (2023 నుంచి) బతికిన తెలంగాణ ప్రజలకు ఎంత అవగాహన పెరిగిందో కాలమే చెప్పాలి! జాతీయస్థాయిలో మోదీ, తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబు, ఏ పార్టీలో ఉన్నారో తెలియని రేవంత్‌రెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రం కావాలని తమ పథక రచన మొదలుపెట్టారు. జాగ్రత్త!

అగ్నిధార

# ధాన్యానికి మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి

## సింగల్ విండో చైర్మన్ ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గా ఇటీవల రెండోసారి బాధ్యతలు చేపట్టిన గంప వెంకటేష్ గుప్తా రైతుల పక్షాన రైతు సమస్యలపై అధికార పక్షంపై పోరాటం చేయాలని కడ్తాల్ మండల రావిచెడు గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ సభ్యులతో కలిసి ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తాను కలుసుకొని శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగల్ విండోల ద్వారా రైతన్నలకు పనిముట్లు, సబ్సిడీ రుణాలు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. బి ఆర్ ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ రైతుల పక్షపాతిగా వ్యవహరించి దేశంలో ఎక్కడలేని రైతుబంధు, భీమా లాంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగల్ విండో వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు కృషి చేసిందని హైకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ న్యాయమే గెలిచిందని రైతుల పక్షాన సింగల్ విండో వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రైతన్నలు ఎన్నిక ద్వారానే పాలకవర్గాన్ని ఎన్నుకునేటట్టు తీర్పు ఇవ్వడం తోపాటు పాలకవర్గాన్ని కొనసాగించడం పై వారు హర్షం వ్యక్తం చేశారు. వెంకటేష్ గుప్తాను సన్మానించిన వారిలో ఉప సర్పంచ్ బందరీ యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా, వార్డు సభ్యులు రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, నాయకులు బాలకృష్ణ, లింగం, జితేందర్, బిక్షపతి, పవన్ కుమార్, రమేష్, రవి, బాల్ రాజ్, రవికుమార్, రాములు, రాఘవులు, శేఖర్, శశికాంత్, రమేష్ గౌడ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

## సన్మానించే మెమెంటోలు అందజేసిన కాంగ్రెస్ నాయకులు




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం వెల్జాల్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈరోజు విద్య వారోత్సవాల్లో 10 వ. తరగతి లో 500 పైనా మార్కులు సాధించిన 6 మంది విద్యార్థిని, విద్యార్థులకు, వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి, మెమంటో, నగదు పారితోషికం అందించడం జరిగింది వెల్జాల్ ఎగ్జామ్ సెంటర్ లో 539 మార్కులతో టాపర్గా వచ్చిన ఎం. లక్ష్మీ ప్రణతిని శాలువాతో సన్మానించి, మెమొంటో, తో పాటు 3000 రూపాయలు నగదు పారితోషికం అందించడం జరిగింది. ప్రసన్న 533 మార్కులు భార్గవి 518 మార్కులు వినయ్ 508 మార్కులు శృతి 507 మార్కులు, సోహన బేగం 507 మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు శాలువతో సన్మానించి, మెమొంటో అందించి, ఒక్కొక్కరికి 1000 రూపాయలు నగదు పారితోషికం అందించడం జరిగింది. పాఠశాలలో 100 ఉత్తీర్ణత సాధించడంతో ప్రధాన ఉపాధ్యాయురాలు నసీమా సుల్తాను ని శాలువాతో సన్మానించి మేమంటో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నసిమా సుల్తానా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఆయిల్ అంజయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీలు జి శ్రీనివాసమూర్తి, ఎం అంబాజీ, మాజీ ఉపసర్పంచ్ అజీజ్ సీనియర్ నాయకులు పి అశోక్ బాబు, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అరిఫ్, నాయకులు లకు మల్ల మల్లేష్, పులిజాల విష్ణు విద్యార్థినుల తల్లిదండ్రులు శ్రీనివాస్ గౌడ్, కోటయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామంలో బజార్ పవన్ తండ్రి కృష్ణయ్య కి ఫినిషింగ్ సిమెంటు మరియు మాదే ఆంజనేయులు నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి సిమెంటు బస్తాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు. ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్. యాకాల సుమిత్ర భీమయ్య ఉప సర్పంచ్ బలగం కేశవులు తదితరులు పాల్గొన్నారు

### అమ్మవారి ఆశీర్వాదంతో గ్రామ ప్రజలు పాడి పంటలతో చల్లగా ఉండాలి

**బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ద్యాపనిఖిల్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఊర్కొండ మండలంలోని తిమ్మన్న పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి పండుగ లో మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ మాజీ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీర్వాదంతో గ్రామ ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆయూబ్ పాషా, సర్పంచ్ రేణమ్మతిరుపతయ్య, ఉప సర్పంచ్ వెంకటయ్య ,కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ నాయకులు శివారెడ్డి, నర్సింహా, రమేష్ ఉన్నారు.

### ఓటర్ జాబితా సమగ్ర సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

**తలకొండపల్లి మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపట్టనున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, బూత్ ఏజెంట్లు పనిచేయాలి 2002 ఓటర్ లిస్ట్ ఆధారంగా నిర్వహించే వల్ల అనేక మంది ఓట్లు గల్లంతయి అవకాశం ఉంటుంది అందువల్ల టిపిసిసి ఆదేశం మేరకు మరియు కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సూచన మేరకు ఈనెల 25వ తారీకు నుండి ఇల్లు ఇల్లు తిరిగి ఓటర్ల జాబితాలను సరి చేసే కార్యక్రమాల సంబంధిత అధికారులు చేపట్టడం జరుగుతుంది కనుక ఈ ప్రక్రియ ప్రారంభం నుండి గ్రామ కమిటీ ఉత్సాహంగా పనిచేస్తూ అధికారులతో సంప్రదింపులు జరుపుట ఏమైనా సమాచారం కావలిస్తే ఆర్ డి ఓ తాహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలి రాబోయే మండల జెడ్పిటిసి ఎంపీటీసీ ఎమ్మెల్యే ఎన్నికలు కొత్తగా తయారయ్యే ఓటర్ల జాబితా ప్రకారం జరుగుతాయి ఓటర్ల జాబితాను నిర్లక్ష్యం చేస్తే అనేకమంది ఓట్లు పోతాయి కాబట్టి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సెల్, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు హాజరు కాగలరని తలకొండ పల్లి మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

### పేద ప్రజలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి

**లబ్ధిదారునికి చెక్కు అందజేసిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామ పంచాయతికి చెందిన వల్లింపుల యాదయ్య కి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారం తో మంజూరైన ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కు గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డీ చేతుల మీదుగా అందజేయడం జరిగింది.కార్యక్రమంలో సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి బర్రెడ్డి అంజిరెడ్డి భాస్కర్ రెడ్డి యలమంద రెడ్డిగారు ప్రతాపరెడ్డి యలమంద రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఉప్పల ట్రస్ట్ ద్వారా మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం అజిలాపురం గోరంట్ల మైసమ్మన్ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్ధగోని రమేష్ గౌడ్ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక కసహాయం 3000 రూపాయలు రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు ,ఉప సర్పంచ్ గణేష్ గౌడ్. వార్డు నెంబర్ గోరంట్ల రమేష్. కొప్పుల రవికుమార్ గౌడ్. కొప్పు కృష్ణయ్య. కొప్పుల రామస్వామి. గోరంట్ల వెంకటయ్య. వడ్డే ఆడమయ్య. గోరంట్ల పెద్దయ్య. ఖాజాబీ. ఎర్ర చంద్రయ్య. గునిగంటి శంకర్. తోకల యాదయ్య. శ్రీకాంత్. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

### ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

**వేడుకలో పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు**




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తిలో వేసవి శిబిరాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, చౌదర్పల్లి వెంకటయ్య గౌడ్. కుప్పగండ్ల మాజీ సర్పంచ్ శేఖర్ వెల్దండ మండల ముఖ్య నాయకులు వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

### ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండల కేంద్రంలో మఖాన్ చెన్నయ్య, తండ్రి రామయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా రాష్ట్ర నాయకులు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మ న్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా సిమెంట్ బస్తాలు అందజేయడం జరిగింది. సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఇటమోని వెంకటేష్ యాదవ్, బీఆర్ఎస్ యువనాయకులు అనుపటి కుమార్, నూకం నవీన్,లడ్డు తదితరులు పాల్గొన్నారు

### అభిషేక్ అకాల మరణం విషాదకరం

**ఆర్థిక సహాయం అందజేసిన ద్యాప నిఖిల్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఊర్కొండ మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన రొడ్డ అభిషేక్ (18) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్,కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేవల్లి గ్రామ సర్పంచ్ రొడ్డ బంగారు మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయ్యుబ్ పాష మరియు పి ఎ సి ఎస్ డైరెక్టర్ ఫరీద్ మరియు వార్డు సభ్యులు కాటమోని వెంకటయ్య,కర్రోళ్ల వెంకటయ్య,ఎర్రోళ్ల జంగయ్య, శంకర్,పరశురాములు, ఖలీల్ ఖాన్ మరియు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఖాజా,మాల కృష్ణయ్య,జంగి రెడ్డి,రమేష్, చంద్రయ్య, జంగయ్య, రాములు, కృష్ణయ్య, చంద్రయ్య, విజయ్, లింగమయ్య, హనుమయ్య, బాలయ్య,బాల కాశి,జంగయ్య, శేఖర్, చంద్రయ్య,శివ వెంకటయ్య, చెన్నకేశవులు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా

**ఆర్థిక సహాయం అందజేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన బరిగెల రాములు అనారోగ్యం తో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబానికి 5000 ఐదు వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ల గ్రామ సర్పంచ్ పాలకూర్ల సంతోష రాజు గౌడ్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సురమల్ల చెన్నయ్య,మాజీ ఎంపీటీసీ సభ్యుడు సురమల్ల సత్తయ్య, పాలకూర వెంకటయ్య, వార్డ్ మెంబర్ తిరగమల్ల లక్ష్మయ్య, వడ్డమోని శేఖర్, పెరమండ్ల లింగం, పులికంటి మైసయ్య, పులికంటి కృష్ణ, కలకొండ మల్లేష్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సరిత తిరుపతయ్య నీ మర్యాద పూర్వకంగా కలిసిన శివ ప్రసాద్



**అగ్ని ధార న్యూస్** తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్ పర్సన్గా బాధ్యతలు చేపట్టిన సరిత తిరుపతయ్య నీ వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేసిన కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి వార్డు సభ్యులు కొంగళ్ళ శివప్రసాద్ కురుమ ఈ సందర్భంగా పదవీ కాలంలో సంస్థ అభివృద్ధి, సంక్షేమానికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ నాయకులు వంగూర్ శివకుమార్ మహేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుకు ప్రజాప్రతినిధులు సహకరించాలి..!

**కమాన్ పూర్ ఏ. ఎం. సి చైర్మన్ వైనాల రాజు, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్**



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** గ్రామీణ నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యానందించే కమాన్ పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరింతగా విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రజాప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలని కమాన్ పూర్ ఏ. ఎం. సి చైర్మన్ వైనాల రాజు, కళాశాల ప్రిన్సిపాల్ కాశీమల్ల సుధాకర్ అన్నారు. మండలంలోని గుండారం గ్రామంలో గల కమాన్ పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రిన్సీఫాల్ కాశిమల్ల సుధాకర్ అధ్యక్షతన ఉమ్మడి కమాన్ పూర్ మండల సర్పంచ్, ఉప సర్పంచులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతులతో పాటు ఆధునిక లాబోరేటర్లు, అనుభవజ్నులైన అధ్యాపకులతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తూ ప్రైయివేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగుతుందన్నారు. తాజాగా డిజిటల్ విద్యాబోధన కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ ఉత్తీర్ణత ఫలితాలు సాధించిన జూనియర్ కళాశాలల్లో కమాన్ పూర్ జూనియర్ కళాశాల 6వ స్థానంలో ఉండడం ఇక్కడ విద్యానందిస్తున్న తీరుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పడిన నాటి నుండి ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు పలుమార్లు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విద్యార్థులు ర్యాంక్లు సాధించిన సందర్భాలు ఉన్నాయన్నారు. కమాన్ పూర్ జూనియర్ కళాశాలలో మరింతగా విద్యార్థుల సంఖ్య పెంపొందించడం, అభివృద్ధి కోసం కమాన్ పూర్ ఉమ్మడి మండల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అంకిత భావంతో ఉత్తమ విద్యాబోధన అందిస్తున్న అధ్యాపక బృందం పనితీరు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జంగిలి పోచాలు, రంగు సత్యనారాయణ గౌడ్, రేండ్ల శారద, శిలారపు మల్లయ్య, పల్లె మాధవి నారాయణ, గుమ్మడి శ్రీనివాస్, పొనగంటి కుమార్ లతో పాటు వివిధ గ్రామాల ఉప సర్పంచులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫలితాలపై విస్తృత ప్రచారం చేయాలి

**ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు..**
**ప్రభుత్వ పాఠశాలల ఫలితాలపై విస్తృత ప్రచారం చేయాలి..**
**మండలాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించాలి..**
**ప్రతి హైస్కూల్ పరిధిలో టాపర్ విద్యార్థుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి..**
**పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా పేరేంట్స్ అప్రమత్తంగా ఉండాలి..**





**అగ్నిధారన్యూస్ పెద్దపల్లిం** ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ..తెలంగాణ రాష్ట్ర 99 రోజులు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. విద్య వారోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు పాల్గొన్నారు ..ఇటీవల వెలువడిన ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి 10వ తరగతి ఇంటర్ పరీక్షలో అధిక మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను సన్మానిస్తూ, వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి చెక్కులను పంపిణీ చేశారు.

**ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...**

2026 పదవ తరగతి ఫలితాలలో పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న 98 మందికి పైగా విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ పనులు, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, చిన్నపాటి మరమ్మత్తులు వంటి అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి పూర్తి చేశారని అన్నారు. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రంగా సందర్శించిన తెనుగువాడ పాఠశాల అప్పట్లో శిథిలావస్థలో ఉండేదని, అనంతరం దానిని పూర్తిగా ఆధునీకరణ చేసి ప్రజా ప్రభుత్వంలో అద్భుతంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం సంతోషకరమని అన్నారు. పెద్దపల్లి పట్టణ పరిధిలో పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 98 మంది విద్యార్థులు ఉన్నారని, మిగిలిన ఐదు గ్రామీణ మండలాల్లో 138 మందికి పైగా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరందరికీ రాబోయే రోజుల్లో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మరింత గుర్తింపు లభించడంతో పాటు ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు చేసిన కృషి సమాజానికి తెలియజేసే అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే ఏడాది సన్మానించే విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కలెక్టర్ సహా ఉన్నతాధికారులను ప్రభుత్వ విప్ సూచించారు. ప్రతి హైస్కూల్ పరిధిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఇంటర్ చదివే దశలో కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లకు గురయ్యే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథపై కఠిన చర్యలు తీసుకోవాలి

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

## మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డా. పసుల రాంమూర్తి డిమాండ్

## రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా బండి రాము నియామకం

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యాచారాల విషయంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డా. పసుల రాంమూర్తి విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సితార కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం నిర్వహించిన మాల మహానాడు ఆఫ్ ఇండియా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్యులపై ఆరోపణలు వస్తే వెంటనే స్పందించే పోలీసులు, రాజకీయ నాయకుల కుటుంబాలకు సంబంధించిన కేసుల్లో ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. ప్రియాంక రెడ్డి ఘటనను ప్రస్తావిస్తూ, అప్పట్లో ఎన్‌కౌంటర్‌కు మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలు, మేధావులు ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, బండి భగీరథ వ్యవహారంలో నిజాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని కోరారు. ఈ సందర్భంగా గోదావరిఖనికి చెందిన మాల మహానాడు నాయకుడు బండి రామును రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా యువత సమస్యలపై ఉద్యమాలు నిర్వహించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన బండి రాము మాట్లాడుతూ, సంస్థ ఆశయాలకు అనుగుణంగా యువతను చైతన్యవంతం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తానన్నారు. పెద్దపల్లి జిల్లాలో యువతకు జరుగుతున్న అన్యాయాలపై త్వరలో భారీ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి లక్ష్మి నరసయ్య, జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలు ఆరే దేవకర్ణ, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట భవిత, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోల శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారులు జక్కుల నారాయణ, గాధాం శ్రీనివాస్, సొగలా రవి, దాసరి శేఖర్, నల్లి త్రివేణి, కోల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో గేదె మృతి

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:** విద్యుత్ షాక్ తో గేదె మృతి చెందిన ఘటన మహమ్మదాబాద్ మండలం రాగార్వల్లి సమీపంలో చోటు చేసుకుంది. చిన్నాయపల్లి గ్రామానికి చెందిన పసుపుల పెంటయ్య ఆదివారం తన గేదెలను మేతకు వదిలాడు. శనివారం సాయంత్రం గాలివానకు విద్యుత్ స్తంభం విరిగిపడి తీగలు కింద పడ్డాయి. గేదె మేత మేస్తూ వెళ్లి విద్యుత్ తీగలను తాకడంతో షాక్ తో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు 1,50,000 వేల ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.



## అమ్మవారి ఆశీర్వాదంతో గ్రామ ప్రజలు పాడి పంటలతో చల్లగా ఉండాలి

**బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ద్యాపనిఖిల్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఊర్కొండ మండలంలోని తిమ్మన్న పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి పండుగ లో మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ మాజీ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీర్వాదంతో గ్రామ ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆయూబ్ పాషా, సర్పంచ్ రేణమ్మతిరుపతయ్య, ఉప సర్పంచ్ వెంకటయ్య ,కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ నాయకులు శివారెడ్డి, నర్సింహ, రమేష్ ఉన్నారు.

## విద్యావేత్త సదానందం గౌడు కు డాక్టరేట్ పురస్కారం

**అభినందనలు తెలిపిన ప్రముఖులు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తెలంగాణ రాష్ట్రం, ఉమ్మడి పాలమూరు జిల్లా తలకొండపల్లి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారులు, సామాజిక విద్యావేత్త అయిల్ సదానందం గౌడు గారికి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ చే డాక్టరేట్ పురస్కారం చెన్నైలోని భారతీయ విద్యా భవన్ లో ఈరోజు ఉదయం11గంటలకు అందజేశారు. సందర్భంగా సదానందం గౌడు మాట్లాడుతూ 26 ఏండ్లుగా సామాజిక విద్యావేత్త గా అంకితభావంతో పని చేయడంతో గౌరవ డాక్టరేట్ పురస్కారం అందజేశారు. డాక్టరేట్ పురస్కారం నాలో మరింత భాద్యత ను పెంచిందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం , తలకొండపల్లి మండలం, చెన్నంపల్లి గ్రామంలో నిరుపేద రైతు కుటుంబంలో అయిల్ యాదయ్య గౌడు, చెంద్రమ్మ దంపతులకు సదానందం గౌడు జన్మించారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా గాని చిన్న వయసులో చక్కగా చదువుకొని ప్రసిద్ధ ఉస్మానియా యూనివర్సిటీలో ఫస్టు క్లాసులో పట్టా పొందారు. విద్యా రంగంలో గత 26 ఏండ్లుగా లెక్చరర్ గా వారు చేసిన సేవలు ,పర్యావరణ పరిరక్షణకై చేసిన కృషి, సామాజిక సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ అవార్డు అందజేశారని పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారులు , సామాజిక విద్యావేత్త , పర్యావరణ పరిరక్షకులు, ఉత్తమ లెక్చరర్ అవార్డు గ్రహీత అయిల్ సదానందం గౌడు నిరంతరం విద్యార్థుల్లో జ్ఞానాన్ని వెలికితీయడం అవినీతికి వ్యతిరేకంగా పోరాటం, సామాజిక న్యాయం కోసం చేసిన ప్రయత్నాలు గౌరవ డాక్టరేట్ పురస్కారం అందజేయడం జీవితంలో ఎంతో ఆనందాన్ని కల్గించిందన్నారు. విద్య బోధించడం నా హాబీ, సమస్యలపై ఉద్యమించడం నా నైజం ,పర్యావరణ పరిరక్షణ నా బాధ్యత అని సదానందం గౌడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా యూనివర్సిటీ వైస్ చాన్సులర్ అమృతవల్లి ,మద్రాస్ హైకోర్టు జడ్జి వెంకటేశన్ ,గోని నర్సింహ్మ గౌడ్, రష్య రాయబారి రిజిస్ట్రార్, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీ పరీక్షలతో పాటు తల్లిదండ్రులతో సమావేశాలు

### విద్యా వారోత్సవాలతో మరింత బాధ్యత పెరిగింది

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ప్రభుత్వ డిగ్రీ కళాశాల కల్వకుర్తిలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. మే 11 నుండి 17 వరకు వారం రోజుల పాటు విద్యా వారోత్సవాల్లో కళాశాల అభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు పోటీ పరీక్షల్లో శిక్షణ, యోగ సాధన, తల్లిదండ్రులతో సమావేశాలు, కళాశాల ప్రాంగణం సందర్శన, పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేయడం, అవస్థాపన సౌకర్యాల దాతలకు సన్మానాలు, పుస్తక ప్రదర్శన, ఉపకార వేతనాల చెక్కుల పంపిణీ, కృత్రిమ మేధస్సు మరియు నవ కల్పనలు నైపుణ్యం పెంపుదలకు ప్రతి ఒక్కరి కృషి అభినందనీయమని వారన్నారు. ఉమ్మడి జిల్లాలోని మొట్ట మొదటిసారిగా కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే ప్రత్యేకంగా యూనిఫాం డ్రెస్ కోడ్ ను విద్యార్థులకు కేటాయించడం జరిగిందని వారన్నారు. దోస్త్ వెబ్సైట్ ద్వారా అడ్మిషన్లను అంచలంచెలుగా పెంచుతూ వస్తున్నామని ప్రైవేటు డిగ్రీ కళాశాలకు దీటుగా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో విద్యను అందించడమే తమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఉత్తమమైన ఫలితాలతో జిల్లాలోని ఉన్నతంగా కళాశాలను తీర్చిదిద్దుతామని వారు తెలిపారు. విద్యా వారోత్సవాల వల్ల కళాశాలలోని ప్రతి ఒక్కరికి బాధ్యత మరింతగా పెరిగిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డా.బి రాజు, జగదీశ్వర్ రెడ్డి, శ్యామ్ సుందర్, డా. శ్రీనివాస్, అధ్యాపకేతర బృందం, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

**కుమారుడి రక్షణ కోసం హోదా దుర్వినియోగం**

**డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ ధ్వజం**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం)** కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని చట్టం నుంచి కాపాడటం కోసం అధికార హోదాను అడ్డం పెట్టుకోవడం గర్హనీయమని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ తీవ్రంగా విమర్శించారు. మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను 9 రోజుల పాటు రహస్యంగా దాచిపెట్టడం నేరపూరితమని ఆయన మండిపడ్డారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. బండి సంజయ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రపతి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

**చట్టం ముందు అందరూ సమానులే..**

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తులు చట్టానికి లోబడి పనిచేయాలి కానీ, చట్టాన్ని చుట్టంలా మార్చుకోకూడదని నగేష్ హితవు పలికారు. "పోలీసులు నిందితుడి కోసం వెతుకుతుంటే, బాధ్యతాయుతమైన మంత్రిగా సమాచారం ఇవ్వకపోవడం చట్టాన్ని మోసం చేయడమే. సామాన్యులకు ఒక న్యాయం, అధికార పార్టీ నేతలకు ఒక న్యాయమా?" అని ఆయన నిలదీశారు.

**విచారణపై ప్రభావం పడే అవకాశం:**

పోక్సో వంటి తీవ్రమైన కేసులో నిందితుడిని వెనకేసుకొచ్చిన వ్యక్తి పదవిలో ఉంటే విచారణ పారదర్శకంగా సాగదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార బలంతో సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని, బాధితురాలికి న్యాయం జరగాలంటే సంజయ్ పదవి నుంచి తప్పుకోవాలని స్పష్టం చేశారు. మహిళలపై దాడులకు అండగా నిలవాల్సిన వారే నిందితులకు రక్షణ కల్పించడం దురదృష్టకరమని నగేష్ విమర్శించారు.

"బండి సంజయ్ తీరు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. నిందితుడిని రక్షించడం ద్వారా ఆయన కూడా ఆ నేరంలో భాగస్వామి అయ్యారు. చట్టంపై గౌరవం ఉంటే తక్షణమే రాజీనామా చేయాలి.'లి

--- డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్

# కార్మికులు లేకున్నా జీతాలు నొక్కేసిన్రు?

**తొలగించిన వారి పేరుతో డ్రా**
**పారిశుధ్య విభాగంలో సరికొత్త దందా**
**బయోమెట్రిక్ హాజరు లేకుండానే వేతనాలు**
**చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు**
**పట్టించుకోని పాలకవర్గం**



**కరీంనగర్ :** కరీంనగర్ నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న బదిలీ కార్మికుల విషయంలో గత కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆ సమయంలో 65 మంది పని చేస్తున్నట్టు గుర్తించారు. ఆ మేరకు కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులు, తమ సమీప బంధువులు ఎవరు పని చేస్తున్నారో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం ఆయా కార్మికుల పేర్లను తొలగించి, బదిలీగా పని చేస్తున్న వారి పేర్లను చేర్చి పనులు కొనసాగించారు. ఈ ప్రక్రియలో 8 నుంచి 10 మంది విధులు నిర్వహించే స్థితిలో లేకపోవడం.. వారికి బదులుగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ రాకపోవడంతో వారిని విధుల నుంచి తప్పించారు. కాగా, అప్పటి నుంచి వారికి వేతనాలు అందించడం లేదు. కాగా, ఇటీవల కొత్తగా పారిశుధ్య అధికారులు ఆ పేర్లపై జీతాలను డ్రా చేసినట్టు తెలుస్తున్నది. వాస్తవానికి పారిశుధ్య కార్మికులకు బయోమెట్రిక్ విధానంలో హాజరు తీసుకొని, దాని ద్వారానే జీతాలు చెల్లిస్తారు. కానీ, తొలగించిన కార్మికుల జీతాలను మాత్రం మాన్యువల్‌గానే హాజరు పరిగణలోకి తీసుకొని డ్రా చేసినట్టు సమాచారం. గతంలో కార్మికులను తొలగిస్తే.. ఇప్పుడు వారి పేరిట జీతాలు ఎలా డ్రా చేశారన్న విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి స్థానాల్లో ఎవరినైనా తీసుకొని జీతాలు ఇస్తున్నారా..?, లేక తప్పుగానే నమోదు చేసి నొక్కేస్తున్నారా..? అన్న చర్చ బల్దియాలో సాగుతున్నది. ఈ వ్యవహారంలో భారీగానే ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పారిశుధ్య విభాగంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నా అటు ఉన్నతాధికారులు గానీ, ఇటు పాలకవర్గ సభ్యులు గానీ దృష్టి సారించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆ అధికారులు తమ ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు కార్పొరేటర్లే విమర్శిస్తున్నారు. వీరిపై ఇప్పటికే ఫిర్యాదులు, ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయినా, ఎక్కడా కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని వాపోతున్నారు. జిల్లా యంత్రాగం దృష్టి సారించి చర్యలు చేపడితే అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

# ధాన్యం కొనరు నిర్లక్ష్యం వీడరు

**కేంద్రాల్లోనే రాశులు**
**మందడికొడిగా సేకరణ.. రైతుల పడిగాపులు**
**తాలు, తప్ప పేరిట దోపిడీ.. నిండా మునుగుతున్న వైనం**
**తూకం వేసిన బస్తాలు మిల్లులకు తరలింపులో అలసత్వం**
**సిరిసిల్ల జిల్లాలో కొనుగోళ్లు అధ్వానం**
**236 సెంటర్లలో ఇదే తీరు**
**3 లక్షల మెట్రిక్ టన్నుల టార్గెట్‌లో ఇప్పటివరకు కొన్నది 41 శాతమే**



**రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ గాడి తప్పింది. ప్రభుత్వ పట్టింపులేమి.. అధికారుల నిర్లక్ష్యంతో సేకరణ పూర్తి అధ్వానంగా.. మందకొడిగా సాగుతున్నది. పలుచోట్ల సెంట ర్లకు ధాన్యం తెచ్చి నెల గడుస్తున్నా వెనువెంటనే కొనకపో వడం, మరోవైపు తూకం వేసిన బస్తాలు మిల్లులకు తరలిం పులో జాప్యంతో కేంద్రాల్లోనే ధాన్యం మూలుగుతున్నది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు కేవలం 1,25,808 మెట్రిక్ టన్నులు కేవలం (41 శాతమే) పూర్తికావడం పరిస్థితికి అద్దంపడు తున్నది. మరోవైపు తప్ప, తాలు పేరిట అదనపు తూకం వేస్తూ దోపిడీ చేస్తుండడంతో రైతాంగం నిండా మునుగుతున్న పరిస్థితి కనిపిస్తుండగా, పట్టని ఉన్నతాధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.
జిల్లాలో యాసంగిలో లక్షా 93 వేల 330 ఎకరాల్లో వరి సాగు చేశారు. మొత్తంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణను అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపీ 132, పీఏసీఎస్ 96, డీసీఎంఎస్ 1, మెప్మా 7 సెంటర్లు ఉండగా, కొనుగోళ్లు మొదలై నెల రోజులు దాటినా సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రక్రియ పూర్తిగా మందకొడిగా సాగుతున్నది. ఇప్పటి వరకు కేవలం లక్షా 25 వేల 808 మెట్రిక్ టన్నులు అంటే 41 శాతం మాత్రమే కొనుగోలు చేయడంతో సెంటర్లలోనే ధాన్యం పేరుకుపోతున్నది. ఈ నెలాఖరు వరకు ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి చేయాల్సి ఉన్నా, క్షేత్ర స్థాయిలో ఆలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.తెలంగాణ సమాచారం

**ఆది నుంచీ అలసత్వమే..**

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మొదటి నుంచీ నిర్లక్ష్యమే కనిపిస్తున్నది. కేంద్రాలకు ధాన్యం వచ్చినా సెంటర్లు ప్రారంభించకపోవడం, ప్రారంభించిన తర్వాత వెనువెంటనే కొనకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలింపులో జాప్యం చేయడం, తూకం వేసిన బస్తాలు ఎండకు బరువు తగ్గుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలు.. మండుటెండలతో నిత్యనరకం చూస్తున్నామని వాపోతున్నారు. మరోవైపు తాలు, తప్ప, తరుగు పేరిట ధాన్యంలో కోత పెడుతున్నారని మండిపడుతున్నారు. ఇక జిల్లాలోని పలు కేంద్రాల్లో లారీల కొరతతో రైతులే ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకోని ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్నారు. అయితే ధాన్యం కొను గోళ్లలో నిర్లక్ష్యంపై కొద్దిరోజులుగా కోనరావుపేట, ఇల్లంత కుంట, రుద్రంగి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, చందుర్తి పలు మండలాల్లో రైతులు ధర్నాలు, ఆందోళనలు చేస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఇలాగే ఉండడంతో ఇటీవల ముఖ్యమంత్రి సైతం కొనుగోళ్లపై సమీక్షించడం పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈ క్రమంలో కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు దీంతో రెవెన్యూ శాఖ అధికారులు సహా పోలీస్, రవాణా విభాగం అధికారులు కేంద్రాల బాట పడుతున్న పరిస్థితి ఉంది. మరో 13 రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి వస్తాయని వాతావరణ శాఖ సూచనతో ఆందోళన చెందుతున్న రైతుల్లో పలువురు దళారులకు అమ్ముకోవడం సర్కారు నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నది.

**20 రోజులు పడిగాపులు పడ్డా**

నేను ఎకరంన్నర భూమిలో వరి వేసిన. మూడు ట్రాక్టర్ల వడ్లు పండినయి. 20 రోజుల క్రితం రగుడులోని సెంటర్‌కు తీసుకవచ్చినం. వర్షంతో ధాన్యం పూర్తిగా తడిసింది. సెంటర్‌లోనే ఆరబెట్టుకున్నా. 20 రోజులకు సీరియల్ వచ్చింది. సగం వడ్లే 30 బస్తాలే జోకిర్రు. సగం వడ్లను గడ్డి తాలు ఉందని ఆపిన్రు. మళ్లీ ఆరబెట్టాలని చెప్పిర్రు. చానా రోజులు తిప్పలు పడితే ఆఖరికి మిగిలిన వడ్లు జోకిర్రు. కానీ లారీలు లేక బస్తాలు సెంటర్లనే ఆగినయి. నిన్ననే మిల్లుకు పోయినయి.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం.. మార్కెట్‌లోనే గుండెపోటుతో రైతు మృతి



**వరంగల్:** కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి మరీ పంటలు పండిస్తే ధాన్యం కొనే నాథుడు లేక అన్నదాతలు చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వడ్ల కల్లాల్లోనే ప్రాణాలు విడుస్తున్నారు. తాజాగా వరంగల్ జిల్లానెక్కొండ మండలం అలంకానిపేట గ్రామంలో గాజుల పెద్ద వెంకటేశ్వర్లు అనే రైతు ధాన్యం మార్కెట్‌లో హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు. రైతు వెంకటేశ్వర్లు వరి, మొక్కజొన్న సాగుడు చేశాడు. పంటలు చేతకొచ్చాక అమ్మేందుకు మార్కెట్‌కు తరలించాడు. మార్కెట్ ఇబ్బందుల దృష్ట్యా మొక్క జొన్నలను కాపుల కనపర్తిలో 15 రోజుల క్రితం తరలించాగా వడ్లు మాత్రం అలంకానిపేటలో మార్కెట్‌కు తరలించాడు. ఆదివారం మార్కెట్లోనే గుండెపోటుతో కుప్పకూలాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత నెల రోజుల నుంచి పండించిన పంటలు కొనుగోలు చేయకపోవడంతో ఆవేదన చెంది గుండెపోటుతో మరణించాడని కుటుంబ సభ్యులు, తోటి రైతులు ఆరోపించారు. వెంకటేశ్వర్లు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం..!



**యాదాద్రి :** నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణ దశలో ఉన్న యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్-3లో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. యూనిట్-3 పరిధిలోని టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పంప్ వద్ద లూబ్రికేషన్ ఆయిల్ లీక్ కావడమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా అధికారులు అంచనా వేస్తున్నారు. చమురు లీకేజీ కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, ప్లాంట్ ప్రాంగణమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. ఈ ప్రమాదంలో పంప్ ఏరియాలోని కంట్రోల్ కేబుళ్లు, కొన్ని కీలకమైన వాల్వ్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే ప్లాంట్ సిబ్బంది, అక్కడే ఉన్న అగ్నిమాపక యంత్రాలు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. దాంతో బాయిలర్లు, మెయిన్ టర్బైన్లు వంటి ప్రధాన యంత్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న తెలంగాణ జెన్‌కో ఉన్నతాధికారులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నష్టాన్ని అంచనా వేయడంతో పాటు, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు తెలుసుకోవడానికి అంతర్గత విచారణకు ఆదేశించారు

## మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికులం డిపెండెంట్ల ఉద్యమానికి మద్దతు

**ఏఐటియుసి అండగా ఉంటుందన్న మడ్డి ఎల్లా గౌడ్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికుల డిపెండెంట్ల ఉద్యమానికి ఏఐటియుసి పూర్తి మద్దతు ఉంటుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ తెలిపారు.ఆదివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన ఐక్య వేదిక కార్యాచరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి 2024లో జరిగిన తొలి స్ట్రక్చర్ సమావేశంలోనే యాజమాన్యాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు.ఈ అంశం లీగల్ సమస్యకు సంబంధించినదని పేర్కొంటూ ప్రభుత్వం దృష్టికి నివేదిక పంపుతామని యాజమాన్యం తెలిపిందన్నారు. అయితే ప్రభుత్వం పరిష్కారం చూపకుండా అడ్వకేట్ జనరల్ అభిప్రాయం కోసం పంపిందని విమర్శించారు. ఇటీవల ఈ నెల 12న సింగరేణి భవన్‌లో జరిగిన అధికారుల సమావేశంలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు ఏఐటియుసి తరపున ఉద్యమాత్మకంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.లక్క శ్రావణ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వై.వి రావుతో పాటు కార్మిక సంఘాల నాయకులు ఐ.కృష్ణ, క్రాంతి కుమార్, కుమారస్వామి, పోషమల్లు, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద రోగికి ఆర్థిక సాయం

**ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి చేయూత**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద రోగికి ఆర్థిక సహాయం అందించారు. చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న సామాజిక సేవా సంస్థ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబానికి నగదు సహాయం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం మరింత మెరుగైన వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సేవా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సొమ్మును ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దు

**భవన కార్మికులకు పెన్షన్, సంక్షేమ హక్కుల కోసం మే 25న 'ఛలో హైదరాబాద్'**
**టీయూసీఐ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం దారుణమని తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఆడెపు శంకర్ విమర్శించారు. భవన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించడం, ప్రైవేట్ ఏజెన్సీల విధానాన్ని రద్దు చేయడం, సహజ మరణ పరిహారాన్ని ఐదు లక్షల రూపాయలకు పెంచడం వంటి డిమాండ్లతో మే 25న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.ఆదివారం ఎన్టీపీసీ, గోదావరిఖని, పెద్దంపేట ప్రాంతాల్లోని కార్మిక అడ్డాల వద్ద టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'ఛలో హైదరాబాద్' గోడపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆడెపు శంకర్ మాట్లాడుతూ, అరవై ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు తొమ్మిది వేల రూపాయల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలును ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని నిలిపివేయాలని కోరారు. ప్రైవేట్ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల పథకాన్ని రద్దు చేసి, ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ ద్వారా వైద్య సేవలు అమలు చేయాలని సూచించారు.సహజ మరణ పరిహారాన్ని ఐదు లక్షల రూపాయలకు పెంచాలని, వివాహ కానుకలు, ప్రసూతి సహాయ నిధిని ప్రస్తుతం ఉన్న 30 వేల రూపాయల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, నాలుగు కార్మిక చట్ట సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్మిక అడ్డాల వద్ద ఆశ్రయ కేంద్రాలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ మే 25న హైదరాబాద్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం వివిస్టీ నుంచి ప్రదర్శన ప్రారంభించి కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కార్మికులు కష్టపడి చెల్లిస్తున్న బీమా నిధులను ప్రైవేట్ సంస్థలకు మళ్లించడం ద్వారా కోట్ల రూపాయలు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. ప్రయోజనం లేని ఆరోగ్య పరీక్షల పేరిట కార్మికుల నుంచి భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, కలవల రాజమల్లు, ఉడుత శ్రీనివాస్, కే బాబు, కే రాజేష్, ఎం సతీష్, కే నారాయణాద్రి, జి లక్ష్మణ్, భీమన్న, పెంద్యాల ఓదెలు, కే లింగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలు

**రౌడీషీట్లు తెరిచి కఠిన చర్యలు తీసుకుంటాం**
**: సీపీ అంబర్ కిషోర్ ఝా**
**శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని పిలుపు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీట్లు తెరిచి పీడీ యాక్ట్ అమలు చేస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి హమాలీవాడ పోచమ్మ గుడి ప్రాంతంలో శనివారం రాత్రి నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీపీ పర్యవేక్షణలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం అనుమానాస్పద ప్రాంతాలు, ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన సీపీ, ఏవైనా సమస్యలు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాల సమాచారం ఉంటే వెంటనే డయల్-100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్న ఆయన, గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రజలు పోలీసులతో సానుకూలంగా స్పందించడం మంచి పరిణామమన్నారు. ప్రజలు--పోలీసుల మధ్య సమన్వయం బలపడితే సమాజంలో నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు.ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చినా, పనుల్లో పెట్టుకున్నా వారి పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని కోరారు.మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, షీ టీమ్‌లు, భరోసా కేంద్రాలు నిరంతరం పనిచేస్తున్నాయని సీపీ తెలిపారు. మహిళలు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువతను వ్యసనాలకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన సీపీ, వాటి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, వ్యసనాలకు గురైన వారి కోసం ప్రభుత్వ సహకారంతో మెడికల్ కళాశాలలో ప్రత్యేక డీ-అడిక్షన్ వార్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాబోయే బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్, సీఐలు ప్రమోద్ రావు, రమణమూర్తి, ఆకుల అశోక్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు, కార్పొరేటర్లు నల్ల శంకర్, పూదరి ప్రభాకర్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



# ‘పెద్ది’ ట్రైలర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం.. స్పెషల్ అప్‌డేట్ ఇచ్చిన రామ్ చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్దిపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని సృష్టించింది. విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న అంశం పెద్ది ట్రైలర్. ఈ ట్రైలర్ విడుదల కోసం సినీ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సమయంలో చిత్రబృందం మరో భారీ అప్డేట్ ఇచ్చింది. ఇప్పటికే ముంబైలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించిన మేకర్స్, తాజాగా ఈ ఈవెంట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ స్వయంగా ఓ ప్రత్యేక గ్లింప్స్ ద్వారా అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. “ఇప్పటివరకు మీరు పాటలు, గ్లింప్స్ చూశారు.. ఇక ఇప్పుడు అసలు బ్లాస్ట్ చూడబోతున్నారు” అంటూ అభిమానుల్లో ఆసక్తిని పెంచేలా రామ్ చరణ్ సందేశం ఇచ్చారు. ఈ మాటలతో సోషల్ మీడియాలో పెద్ది ట్రైలర్‌పై చర్చలు మరింత పెరిగిపోయాయి. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ వేదికగా ఈ గ్రాండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో అభిమానులు, సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశమున్న ఈ ఈవెంట్‌పై ఇప్పుడు ప్రత్యేక ఆసక్తి నెలకొంది. స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో గ్రామీణ నేపథ్యంలో కనిపించిన చరణ్ లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విజేత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించిన పాటలకు ఇప్పటికే మంచి స్పందన లభించింది. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు ప్రత్యేక బలంగా నిలుస్తుందని చిత్రబృందం భావిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్ విడుదలతో సినిమా అంచనాలు మరింత పెరుగుతాయా? అభిమానులు ఆశిస్తున్న స్థాయిలో ఈ ట్రైలర్ ఉండబోతుందా? అన్న ఆసక్తి ఇప్పుడు అందరిలో కనిపిస్తోంది.

# తెలుగు క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్..!

కన్నడ ముద్దుగుమ్మ, హీరోయిన్ శ్రీలీల గురించి టాలీవుడ్ ప్రేక్షకులకు చెప్పాల్సిన పనిలేదు. ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోల సరసన మెప్పించింది. ఈ ఏడాది పరాశక్తి చిత్రంతో తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ కన్నడభామ ప్రస్తుతం ధనుష్‌కు జంటగా కనిపించనున్నారు. తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇక సినిమాల సంగతి పక్కనపెడితే.. ఈ ముద్దుగుమ్మపై గతంలో రూమర్స్ వినిపించాయి. బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో డేటింగ్‌లో ఉందంటూ వార్తలొచ్చాయి. వినాయక చవితి వేడుకల కోసం ఆమె తన తల్లితో కలిసి ముంబయిలోని కార్తీక్ ఇంటికి వెళ్లడంతో పుకార్లు వైరలయ్యాయి. అదే సమయంలో తనకు డాక్టర్ కోడలు కావాలని కార్తీక్ ఆర్యన్ తల్లి చెప్పడంతో మరింత ఆజ్యం పోసింది. కానీ వీటిపై ఎవరూ కూడా క్లారిటీ ఇవ్వలేదు.


తాజాగా శ్రీలీలపై మరోసారి డేటింగ్ రూమర్స్ సోషల్ మీడియాలో గుప్పుమంటున్నాయి. ఈ సారి ఏకంగా టీమిండియా క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందంటూ కథనాలొస్తున్నాయి. మన తెలుగువాడు, యంగ్ క్రికెటర్‌తో డేటింగ్ చేస్తోందని కథనాలు మొదలయ్యాయి.

ఏడాదిగా రూమర్స్..

శ్రీలీల, తిలక్ వర్మ ప్రేమలో ఉన్నారని గతేడాది నుంచి సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవల వీరిద్దరూ కలిసి కనిపించారని వార్తలు రావడంతో రూమర్స్‌కు మరింత బలం చేకూరుతోంది. దాదాపు ఆరు నెలల క్రితమే శ్రీలీల తన తల్లితో కలిసి తిరుమలను సందర్శించింది. అదే సమయంలో తిలక్ వర్మ కూడా అక్కడే ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా శ్రీలీల, ఆమె తల్లితో పాటు ముంబయి ఇండియన్స్ ఆటగాళ్లతో కలిసి కనిపించడంతో రూమర్స్ మరింత బలపడుతున్నాయి. అయితే తమపై వస్తున్న వార్తలపై ఇప్పటి వరకు ఎవరు కూడా స్పందించలేదు.



# ‘త్రికాల’గా వస్తున్న శ్రద్ధాదాస్.. రిలీజ్ డేట్ ఫిక్స్!



భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ ‘త్రికాల’ మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక--శ్రీనివాస్ నిర్మించారు. చాగంటి ప్రొడక్షన్ ఎల్‌ఎల్‌బి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతుంది. ఇటీవలి కాలంలో మైథలాజికల్ టచ్‌తో వచ్చిన థ్రిల్లర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో ‘త్రికాల’పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన హైక్వాలిటీ వీఎఫ్ఎక్స్ ఈ సినిమాకు ప్రధాన బలం కానుందని చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మాస్టర్ మహేంద్రన్ యాక్షన్ సీక్వెన్స్‌లు, అజయ్ పవర్‌ఫుల్ పాత్ర, శ్రద్ధాదాస్ కొత్త లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ...“ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే శక్తి చుట్టూ ‘త్రికాల’ కథ తిరుగుతుంది. భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు ‘త్రికాల’ ఒక కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకం ఉంది” అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ... సరికొత్త కాన్సెప్ట్‌తో, మైథలాజికల్ టచ్‌తో రూపొందిన ‘త్రికాల’ ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, ఆసక్తి.. వంటి అంశాలు కలిసిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త ఫీలింగ్ ఇస్తుంది’ అని పేర్కొన్నారు.ఈ సినిమాకు హర్షవర్ధన్ రమేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

# రజినీకాంత్ జైలర్ 2లో గెస్ట్ రోల్స్‌లో ఎవరెవరు కనిపించబోతున్నారంటే..?



సూపర్ స్టార్ రజినీకాంత్ క్రేజీ లైనప్‌లో ఒకటి జైలర్ సీక్వెల్ జైలర్ 2 కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడని తెలిసిందే. సీక్వెల్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. జైలర్ 2లో ముత్తువేల్ పాండ్యన్ (తలైవా పాత్ర పేరు) మరింత పవర్ ఫుల్ రోల్‌లో చూపించబోతున్నాడట. నెల్సన్ దిలీప్ కుమార్ మైండ్ బ్లోయింగ్ స్క్రీన్ ప్లే ఐడియా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయనుందని ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్ పార్ట్ ముత్తువేల్ పాండ్యన్ పదవీ విరమణకు ముందు జీవితాన్ని చూపించే ప్రీక్వెల్‌గా ఉండనుండగా.. సెకండాఫ్ పూర్తి స్థాయి సీక్వెల్‌గా రానుందట. జైలర్ 2లో పాపులర్ డైరెక్టర్ కమ్ యాక్టర్ ఎస్ జే సూర్య విలన్‌గా కనిపించబోతున్నాడని సమాచారం. గెస్ట్ అప్పీరియన్స్ రోల్స్‌లో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కనిపించనున్నారని టాక్. ఫస్ట్ పార్టులో విలన్‌గా కనిపించి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన వినాయకన్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో కనిపించనున్నాడట. ఇక అనిరుధ్ రవిచందర్ అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో మాస్ ఫీస్ట్‌లా జైలర్ 2 ఉండబోతుందన్న వార్తలు ఇప్పుడు అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాయి. తాజా టాక్ ప్రకారం సెప్టెంబర్ 4 నుంచి జైలర్ 2 వేట మొదలు కానుంది.

# వెంకటేశ్ -- త్రివిక్రమ్ సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్

**పాత హిట్ పాటకు రీమిక్స్ ప్లాన్!**

టాలీవుడ్‌లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో హీరో వెంకటేష్- దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కూడా ఒకటి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ కథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు కూడా ప్రధాన ఆకర్షణగా ఉండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో ప్రేక్షకులకు ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇవ్వడానికి చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ గతంలో నటించిన ఓ హిట్ సినిమాలోని పాపులర్ పాటను కొత్తగా రీమిక్స్ చేసి ఈ సినిమాలో ఉపయోగించే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఏ పాటను ఎంపిక చేశారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. సాధారణంగా త్రివిక్రమ్ తన సినిమాల్లో సంగీతం, సంభాషణలు, వినోదం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా అందించడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. దీంతో వెంకటేశ్ పాత సినిమా పాటను కొత్తగా ఎలా చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఇక ఈ సినిమా కేవలం కుటుంబ కథతో మాత్రమే కాకుండా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు ప్రేక్షకులను నవ్వించే కామెడీ ట్రాక్ కూడా కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటేశ్ కామెడీ టైమింగ్‌కు త్రివిక్రమ్ రచన జతకావడంతో మరోసారి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్రివిక్రమ్ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ నుంచి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తి చేసి వేసవి సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. కాగా, వెంకటేశ్ -- త్రివిక్రమ్ అనుబంధం కొత్తది కాదు. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పని చేశారు. ఆ సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వీరిద్దరూ నేరుగా హీరో -- దర్శకుడిగా కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.




Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com